ANN తెలుగు
Follow: @ANNTELUGU
26-08-2025
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 263 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## పర్యావరణ హితంగా గణేష్ చతుర్థి జరుపుకుందాం

**సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక**

హైదరాబాద్, మహా : పర్యావరణానికి హాని చేయని సహజంగా లభించే మట్టి విగ్రహాలతో వినాయకున్ని పూజించి పర్యావరణ పరిరక్షణలో అందరు బాగస్వాములు కావాలని సమాచార పౌర సంబందాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్.ప్రియాంక కోరారు. సోమవారం సమాచార శాఖ కార్యాలయంలో ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాలను స్పెషల్ కమీషనర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, గణేష్ చతుర్థి పది రోజుల పాటు జరిగే ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. రసాయనాలు, పి.ఓ.పితో తయారు చేసిన గణపతి విగ్రహాలను వాడటం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని, పి.ఓ.పి విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, జాయింట్ డైరెక్టర్లు డి. శ్రీనివాస్, కె. వెంకటరమణ, సీఐఈ రాధాకిషన్, డిప్యూటి డైరెక్టర్లు యం.మధుసూధన్, సి.రాజారెడ్డిలతో పాటు సమాచార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**టూప్ న్యూస్**

### మరో వెబ్‌సిరీస్‌లో తమన్నా
- స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్



08

### ఖైరతాబాద్‌లో ఘనంగా బడా గణేశ్ ఆగమన్
- డీజేల హోరు, యువత కేరింతల నడుమ గణపతికి ఘనంగా స్వాగతం



02

### ఆర్టీసీ ఫ్రీ బస్సులకు లైవ్ ట్రాకింగ్
- ఏపీ సీఎం చంద్రబాబు



02





**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,01,620 |
| 22 క్యారెట్ | 93,150 |
| సిల్వర్ (కేజీ) | 1,20,000 |

# ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి ఉగ్రరూపం

## మానవ రూపంలో మృగాలున్నాయి

- అవి ఫాంహౌజ్‌లోనే తిరుగుతున్నాయి
- పోరాటాల పురుటి గడ్డ ఓయూ
- ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో ఓయూను తీర్చిదిద్దుతాం
- అవసరమైతే వెయ్యి కోట్లు ఇస్తా.. మళ్ళీ వస్తా
- కోదండరాం పై కుట్రలు చేశారు..
- మళ్ళీ ఎమ్మెల్సీగా పంపుతా



హైదరాబాద్, మహా : తెలంగాణకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రత్యామ్నాయ పదమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అలాంటి ఉస్మానియా యూనివర్సిటీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. దేశ రాజకీయాలను శాసించిన ఎంతో మంది నేతలు ఈ యూనివర్సిటీ నుంచి వచ్చిన విద్యార్థులేనని ఆయన గుర్తు చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహరావు కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి తదితరులంతా ఈ యూనివర్సిటీ విద్యార్థులేనని ఆయన సోదాహరణగా వివరించారు.

02



## కరీంనగర్‌లోని ఆ ఇంట్లో 40 దొంగ ఓట్లు

### దేవుడి పేరు చెప్పకుండా ఓట్లడిగే దమ్ముందా?

- మరోసారి పీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు
- జనహిత పాదయాత్రలో పీసీసీ చీఫ్ పై పూలవర్షం
- వరంగల్ , వర్ధన్నపేటలలో ఘనస్వాగతం

కరీంనగర్, మహా: దొంగ ఓట్లపై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి సవాల్ విసిరారు. మోదీ మూడోసారి గెలవడానికి ఓట్ల చోరీనే కారణం. మిగతా 2లో



## ప్రధాని జైలుకెళ్లినా రాజీనామా చేయాల్సిందే..

- అరెస్టైన 30 రోజుల్లో బెయిల్ రాకుంటే రిజైన్ తప్పనిసరి
- ప్రధాని, సీఎం సహా అందరికీ ఒకే నిబంధన అమలు చేస్తాం
- జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు
- జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా రాజకీయాల్లోకి ఎక్కువగా లాగొద్దు
- 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, ధన్‌ఖడ్ రాజీనామా అంశంపై అమిత్ షా హాట్ కామెంట్స్


వివరాలు 2లో

## కాంగ్రెస్ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారా?

### ఓట్ చోరీ కాదు.. రాహుల్ గాంధీ బ్రెయిన్ చోరీ

- కాంగ్రెస్ నేతలే రాష్ట్రంలో యూరియా కొరత సృష్టిస్తున్నారు
- ముస్లింలకు రిజర్వేషన్‌లు పెంచి బీసీల తగ్గించే కుట్ర చేస్తున్నారు
- బీజేపీ అధ్యక్షుడు రామ్ చందర్ రావు సంచలన వ్యాఖ్యలు

03




**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | 81,306.85 |
| నిఫ్టీ | 24,870.10 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

## బీసీ రిజర్వేషన్ బిల్లు

### ఢిల్లీలో సీఎం రేవంత్ మంత్రాంగం

న్యాయనిపుణులతో భేటీలు

ఢిల్లీ, మహా: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు తీవ్రం చేశారు. సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, సీతక్క, పొంగులేటి మిగతా 2లో

## మూడు వేలు కొట్టు.. రేషన్ కార్డు పట్టు

**ఖమ్మం జిల్లాలో పేట్రేగుతున్న రేషన్ కార్డు దందా**

- రెవెన్యూ మీసేవ సిబ్బంది కుమ్మక్కు బహిర్గతం
- కార్యాలయాల చుట్టూ తిప్పి దోపిడీ ఆటలు
- ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకున్న అధికారులు



ఖమ్మం, మహా: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పేదల రక్తం పీల్చే రేషన్ కార్డు మాఫియా దందా రోజురోజుకూ విస్తరిస్తోంది. అర్హులైన పేదలకు ఉచితంగా అందించాల్సిన రేషన్ కార్డులను ఇప్పుడు "మూడు వేలు కొట్టు - రేషన్ కార్డు పట్టు" అనే నినాదంగా మార్చేశారు. రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేసే కంప్యూటర్ సిబ్బంది, మీ సేవా నిర్వాహకులు, స్థానిక నాయకులు వరకు ఈ అక్రమ వసూళ్ల ర్యాకెట్‌లో భాగమవుతుండటంతో ప్రజల్లో ఆగ్రహం ఉధృతమవుతోంది. మిగతా 3లో



## బీసీలను మోసం చేస్తే మీ భరతం పడతాం

- ఎంపీ ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్
- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు జరపాలి
- 50 ఏళ్లు పరిపాలిస్తే ఒక్క బీసీ సీఎంనైనా చేశారా?
- కాంగ్రెస్ మరో పదేళ్లు అధికారంలో ఉన్నా బీసీ బిడ్డ సీఎం అయ్యే చాన్స్ ఉండదు
- ఆర్.కృష్ణయ్య చేస్తున్న సత్యాగ్రహ దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపిన ఎంపీ

03

## బరాబర్ స్థానిక ఎన్నికలు పెడతాం..

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం

- బీజేపీ, బీఆర్ఎస్‌కి చిత్తశుద్ధి ఉంటే.. 42 శాతం పార్టీ పరంగా ఇస్తారా?
- ప్రతిపక్షాలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్
- హైదరాబాద్‌ను కేసీఆర్ కనిపెట్టినట్లు.. కేటీఆర్ మాట్లాడటం విడ్డూరమని సెటైర్లు

హైదరాబాద్, మహా: మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌ను కేసీఆర్ కనిపెట్టినట్లు.. కేటీఆర్ మాట్లాడటం మిగతా 3లో



## యూరియా సంక్షోభానికి కాంగ్రెస్సే కారణం

- బీఆర్ఎస్ కట్టిన భవనాలకు రేవంత్ రిబ్బన్ కట్ చేస్తున్నారు
- తెలంగాణకు ద్రోహం చేసిన బీజేపీ, కాంగ్రెస్‌లు దొందూ దొందే
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

03



### జూబ్లీహిల్స్ బై పోల్‌పై ఈసీ మరో నిర్ణయం

అధికారుల నియామకం




02



# బీసీ రిజర్వేషన్ బిల్లు

## ఢిల్లీలో సీఎం రేవంత్ మంత్రాంగం

### న్యాయనిపుణులతో భేటీలు

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ నేత, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. "స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు న్యాయపరంగా ఎటువంటి చిక్కులు లేకుండా చూసేందుకు సలహాలు తీసుకునేందుకు ఢిల్లీకి వచ్చాం. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని కలిసి న్యాయ సలహాలు తీసుకుంటాం"అని భట్టి విక్రమార్క తెలిపారు. సీఎం, మంత్రులు మంగళవారం ఢిల్లీ పర్యటన ముగించుకొని బీహార్‌కు వెళ్లనున్నారు. అక్కడ రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర'లో పాల్గొననున్నారు.

# ఆర్టీసీ ఫ్రీ బస్సులకు లైవ్ ట్రాకింగ్

## ఏపీ సీఎం చంద్రబాబు

**మహా:** 'స్త్రీ శక్తి' ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో సోమవారం ఆయన ఆర్టీసీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మహిళల సహకారంతోనే 'స్త్రీ శక్తి' పథకం విజయవంతమైందన్నారు. ఉచిత బస్సులకు రెండు వైపులా బోర్డులు పెట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ఏపీ మహిళల్లో చైతన్యం ఎక్కువగా ఉంటుందని.. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందుతారన్నారు.

# ఖైరతాబాద్‌లో ఘనంగా బడా గణేశ్ ఆగమన్

**హైదరాబాద్. మహా :** గణేశ్ ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండురాష్ట్రాల్లో అతి పెద్దదైన ఖైరతాబాద్ మహాగణపతి సిద్ధమయ్యాడు. విగ్రహ నిర్మాణంలో చివరి అంకమైన కన్ను దిద్దడం పూర్తయింది. 69 అడుగులతో నిర్మించిన శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి నేత్రాలను శిల్పి రాజేందర్ గీశారు. ఈ సందర్భంగా బడా గణేశ్ ఆగమన్ నిర్వహించారు. డీజేల హోరు, యువత కేరింతల నడుమ గణపతికి ఘనంగా స్వాగతం పలికారు. మరాఠీ బ్యాండ్‌తో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల ముందుగానే మహాగణపతిని దర్శించుకునే అవకాశం భక్తులకు లభించింది.




# జూబ్లీహిల్స్ బై పోల్ పై ఈసీ మరో నిర్ణయం

## అధికారుల నియామకం

**హైదరాబాద్ సిటీ, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది నియామకం కోసం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని నోడల్ అధికారిగా నియమించారు. ఈవీఎం, వివి ప్యాట్ నిర్వహణ కోసం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌవన్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిగా సి.టి.ఓ శ్రీనివాస్, ట్రైనింగ్ అధికారిగా ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, మెటీరియల్ మేనేజ్మెంట్ బాధ్యతలు అడ్మిన్ అదనపు కమిషనర్ కె. వేణుగోపాల్‌కు అప్పగించారు. ఎంసీసీ నోడల్‌అధికారిగా అదనపు ఎస్పీ (విజిలెన్స్)ఎం. సుదర్శన్, లా అండ్ ఆర్డర్, వల్నరబుల్ మ్యాపింగ్, డిస్ట్రిక్ట్ సెక్యూరిటీ ప్లాన్ బాధ్యతలు డీఎస్పీ నరసింహారెడ్డి, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ బాధ్యతలు అడిషనల్ కమిషనర్ (ఫినాన్స్) జీహెచ్‌ఎంసీ బి గీతా రాధికకు అప్పగించారు. ఎన్నికల పరిశీలకులుగా అసిస్టెంట్ వెటర్నరీ అధికారి విల్సన్, డమ్మీ బ్యాలెట్ పేపర్ నోడల్ అధికారిగా సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, మీడియా కమ్యూనికేషన్, ఎంసీఎంసీ అధికారిగా సీపీఆర్ఓ సెక్షన్ పీఆర్ఓ ఎం.దశరథ్ ను నియమించారు. సైబర్ సెక్యూరిటీ, ఐటి, కంప్యూటరైజేషన్ నోడల్ అధికారిగా ఐటి జాయింట్ కమిషనర్ సి.రాధా, హెల్ప్‌లైన్, కంప్లైంట్ రీడ్రెస్సల్ అధికారిగా ఐటి ఏఈ కార్తీక్ కిరణ్, వెబ్‌కాస్టింగ్ అధికారిగా ఐటి ఏఈ తిరుమల కుమార్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

# ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి ఉగ్రరూపం

## మానవ రూపంలో మృగాలున్నాయి

### అవి ఫాంహౌజ్ లోనే తిరుగుతున్నాయి

- పోరాటాల పురుటి గడ్డ ఓయూ
- ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో ఓయూను తీర్చిదిద్దుతాం
- అవసరమైతే వెయ్యి కోట్లు ఇస్తా.. మళ్ళీ వస్తా
- కోదండరాం పై కుట్రలు చేశారు.. మళ్ళీ ఎమ్మెల్సీగా పంపుతా




**హైదరాబాద్, మహా :**

తెలంగాణకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రత్యామ్నాయ పదమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అలాంటి ఉస్మానియా యూనివర్సిటీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. దేశ రాజకీయాలను శాసించిన ఎంతో మంది నేతలు ఈ యూనివర్సిటీ నుంచి వచ్చిన విద్యార్థులేనని ఆయన గుర్తు చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహరావు కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి తదితరులంతా ఈ యూనివర్సిటీ విద్యార్థులేనని ఆయన సోదాహరణగా వివరించారు. కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలు సమస్యలపై చర్చలకే కాదు, సైద్ధాంతిక అంశాలకు వేదిక సైతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక, సాంకేతిక అంశాలపై చర్చలు జరపాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

**ఆక్స్ ఫర్డ్ స్థాయిలో ఓయూను తీర్చిదిద్దుతాం**

చదువుతో పాటు పోరాటాన్ని నేర్పింది ఉస్మానియా వర్సిటీయేనని, యాదయ్య తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులయ్యారని గుర్తు చేశారు. ఉస్మానియా వర్సిటీకి ఐపీఎస్, ఐఏఎస్ లాంటి గొప్ప గొప్ప వ్యక్తులను అందించిన గొప్ప చరిత్ర ఉందన్నారు. వందేళ్లలో ఓయూకు వీసీగా దళితుడిని నియమించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న సీఎం, గత పాలకులు కుట్రపూరితంగా ఓయూను నిర్వీర్యం చేయాలని చూశారని మండిపడ్డారు. "విద్యా ప్రమాణాలు పెంచుకోవాలంటే నేను చేయగల్గింది ఏంటో చెప్పండి. పేదరికం మాకు కొత్తదనం కాదు, చుట్టం కాదు. పేదరికం మా జీవన విధానంలో ఒక భాగం. విద్యార్థులు మీకు ఇబ్బంది కలిగించిన వారికి మీ నిరసన తెలపండి. మీ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వాళ్లను అడ్డుకుంటే అభివృద్ధి ఎలా జరుగుతుందో ఆలోచించుకోవాలి. ప్రపంచంలో పోటీపడేటట్లుగా ఒక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ స్థాయిలో ఓయూను అభివృద్ధి చేసుకుందాం. మీకోసం రూ.1,000 కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వానికి ఏ అభ్యంతరం లేదు" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉస్మానియా వర్సిటీలో చదువుకున్న వారికి చాలా అవకాశాలు వచ్చాయన్న రేవంత్ రెడ్డి, యువ నాయకత్వం దేశానికి అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశానికి అతిపెద్ద సంపద యువతేనని, ఉస్మానియా వర్సిటీ చదువులకే కాకుండా పరిశోధనలకు వేదిక కావాలని ఆకాంక్షించారు.

### డిసెంబర్‌లో మళ్ళీ వస్తా...

డిసెంబర్‌లో మళ్లీ ఆర్ట్స్ కాలేజీలోనే మీటింగ్‌కు హాజరవుతానన్నారు. తాను వచ్చే రోజు క్యాంపస్‌లో ఒక్క పోలీస్ కూడా ఉండొద్దన్నారు. విద్యార్థులను నిరసన చేసుకోనివ్వండంటూ పోలీసులకు సూచించారు. తానను అడ్డుకునే విద్యార్థులకు సమాధానం చెబుతానంటూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కళకళలాడిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రస్తుతం కళా విహీనంగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉస్మానియా వర్సిటీని బతకనివ్వరని, ఓయూలో లేఅవుట్లు చేసి ప్లాట్లు వేస్తారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. చదువుకోవడానికి ఏమి కావాలో చెబితే అన్నీ ఇస్తానని, ఓయూకు నిధులు కావాలంటే వేరే వాటికి నిలిపైనా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

**చదువే మీ బలం కావాలి**

రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వేగంగా విస్తరిస్తోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. యువతను డ్రగ్స్, గంజాయి పట్టి పీడిస్తున్నాయని ఆవేదన చెందారు. విద్యా సంస్థల్లో చైతన్యవంతమైన చర్చలు లేకపోవడం వల్లే డ్రగ్స్ సమస్య ఉత్పన్నమవుతుందని చెప్పారు. చిన్న కాలేజీల్లో సైతం విద్యార్థులు గంజాయికి అలవాటుపడుతున్నారని తెలిపారు. చదువు ఒక్కటే మిమ్మల్ని గుణవంతులు, ధనవంతులను చేసేదంటూ విద్యార్థులకు సీఎం రేవంత్ సూచించారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టేలా ఉన్న నిర్ణయాలను వ్యతిరేకించండి.. అందుకు నిరసన తెలపండంటూ విద్యార్థులకు క్లియర్ కట్‌గా సందేశాన్ని ఇచ్చారు. కానీ సమస్యలు పరిష్కరించేందుకు వచ్చిన వారిని మాత్రం అడ్డుకోకండంటూ విద్యార్థులకు ఆయన హితవు పలికారు. తాను మళ్లీ ఉస్మానియా యూనివర్సిటీకి వస్తానని స్పష్టం చేశారు.

**ఓయూది గొప్ప చరిత్ర :**

చదువు ఒక్కటే మార్గం : గతంలో కళకళలాడిన ఓయూ ప్రస్తుతం కళా విహీనంగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్న ఆయన, విద్యార్థులకు తాను ఇచ్చేది నాణ్యమైన విద్య మాత్రమేనని, తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని తెలిపారు. చదువు ఒక్కటే అన్నింటికి పరిష్కారం అని విద్యార్థులకు సూచించారు. తాను సీఎం అయ్యాక సామాజిక బాధ్యతగా వర్సిటీలకు వీసీలను నియమించినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం పని చేయనివారిని వ్యతిరేకించండని, విద్యార్థుల సమస్యలు చూసి పరిష్కరించాలని చూసే వారిని వ్యతిరేకించాలో వద్దో ఆలోచించుకోవాలని సీఎం రేవంత్ ప్రశ్నించారు. విద్యార్థులకు అనుమానాలు ఉంటే నివృత్తి చేస్తానన్న సీఎం రేవంత్, అధికారం పోయిన వారికి బాధ ఉంటుందని అన్నారు. మీరు అందరూ ఆశీర్వదిస్తేనే సీఎం పదవి చేపట్టానని, సమస్యలు ఉంటే చెప్తే అన్నీ పరిష్కరిస్తానని చెప్పారు. కోదండరాంను ఎమ్మెల్సీగా ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లి రద్దు చేయించారని ఆక్షేపించారు. మళ్లీ 15 రోజుల్లో కోదండరాం ఎమ్మెల్సీ అవుతారని ప్రకటించారు. అబద్ధాల సంఘానికి అధ్యక్షులుగా తండ్రీకుమారులు ఉంటారని పరోక్షంగా విమర్శలు చేశారు. సాంకేతిక నైపుణ్యంతో ఏఐని తెచ్చామన్న సీఎం రేవంత్‌రెడ్డి, హెచ్‌సీయూలో ఏఐ ద్వారా ఏనుగులు, సింహాలను పెట్టారని దుయ్యబట్టారు. ఏనుగులు, సింహాలను ప్రభుత్వం చంపుతున్నట్లు ప్రచారం చేశారని మండిపడ్డారు. తెలంగాణలో ఏనుగులు, సింహాలు లేవని, మానవ రూపంలో మృగాలు ఉన్నాయని, అవి ఫాంహౌస్‌లో ఉన్నాయని ఎద్దేవా చేశారు.

**భవనాలు ప్రారంభం**

ఓయూలో రూ. 90 కోట్లతో నిర్మించిన వసతి గృహ భవనాలను ఆయన ప్రారంభించారు. వాటికి దుందుభి, బీమా వసతి భవనాలుగా నామకరణం చేశారు. కొత్తగా డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం పాల్గొన్నారు. అంతకుముందు ఓయూలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత ఉస్మానియా యూనివర్సిటీకి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేశారు. ఓయూకి సీఎం రాక సందర్భంగా పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# ప్రధాని జైలుకెళ్లినా రాజీనామా చేయాల్సిందే..

## అరెస్టైన 30 రోజుల్లో బెయిల్ రాకుంటే రిజైన్ తప్పనిసరి

ప్రధాని, సీఎం సహా అందరికీ ఒకే నిబంధన అమలు చేస్తాం

జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా రాజకీయాల్లోకి ఎక్కువగా లాగొద్దు

130వ రాజ్యాంగ సవరణ బిల్లు, ధన్‌ఖడ్ రాజీనామా అంశంపై అమిత్ షా హాట్ కామెంట్స్



**ఢిల్లీ, మహా:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ఏఎన్ఐ'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశం పైనా స్పందించారు. ముఖ్యమంత్రి అయినా.. ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేయగలమని అనుకుంటున్నారన్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారని, అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి సిద్ధాంతాలను తాను, బీజేపీ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదన్నారు. ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలన్నారు. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలని సూచించారు. అలా చేయకపోతే.. చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నామని తెలిపారు. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుందన్నారు.

**అందుకే ధన్‌ఖడ్ రాజీనామా చేశారు..**

ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. 'ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతిపక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదు' అని అమిత్ షా స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ.. 'రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు' అని తెలిపారు.

# కరీంనగర్‌లోని ఆ ఇంట్లో 40 దొంగ ఓట్లు



(మొదటిపేజీ తరువాయి)

కరీంనగర్ పట్టణంలో ఓ రేకుల షెడ్డు ఉన్న ఇంట్లో నలభై దొంగ ఓట్లు ఉన్నాయి. దీనిపై సమాధానం చెప్పే దమ్ము బండి సంజయ్‌కు ఉందా? అని సవాల్ చేశారు. దేవుడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో గెలవగలరా? అని అడిగారు. బండి సంజయ్ హయాంలో కేంద్రం నుంచి ఏం వచ్చాయని సూటిగా ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు.. మరి ఇచ్చారా? అని అన్నారు. అంబానీ, అదానీలకు ప్రభుత్వ సెక్టార్ లను కట్టబెడుతున్నారని ఆరోపించారు. బీజేపీ తెలంగాణకు ఏం ఒరగబెట్టిందో చర్చకు సిద్ధమా? అని సవాల్ చేశారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇద్దరూ కలిసి బీసీ రిజర్వేషన్ బిల్లుకు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. హిందూ, ముస్లిం మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ ప్రధాన ఎజెండాగా మార్చుకుందని అన్నారు. మత విద్వేషాలా కోసం క్రికెట్ టీంను సైతం బండి సంజయ్ వాడుకుంటారని ఆరోపించారు. మీడియా ముఖంగా బీసీ రిజ్వేషన్లపై వివరిస్తాం వచ్చే బండి సంజయ్, ఈటల రాజేందర్, అరవింద్‌లకు ఉందా? అని అన్నారు. పాదయాత్ర అనేది కాంగ్రెస్ సంస్కృతిలో ఓ భాగం.. పాదయాత్రతో ప్రజల చెంతకు వెళ్తున్నాం.. సమస్యలు తెలుసుకుంటున్నాం అని చెప్పారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలకు అనుగుణంగా పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. సన్నబియ్యం కార్యక్రమం చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉండదు అని హాట్ కామెంట్స్ చేశారు. కవిత పంచాయితీ ఏంటో తెలుసుకో అని కేటీఆర్‌కు సూచించారు. నాలుగు ముక్కలైన బీఆర్ఎస్ రాజకీయ ముఖ చిత్రంలో కనపడదని అన్నారు. దొంగ ఓట్లతో బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**జనహిత పాదయాత్ర రెండోరోజు సక్సెస్**

వర్ధన్నపేటలో తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత రెండవ విడత పాదయాత్రకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. రెండో రోజు పాదయాత్ర వర్ధన్నపేట ఇల్లందు మార్కెట్ నుంచి ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. పాదయాత్రలో మహేష్ గౌడ్ కి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పలుచోట్ల మహిళలు టీపిసిసి చీఫ్ పై పూల వర్షం కురిపించారు. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు టీపీసీసీ చీఫ్‌ను భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాదయాత్రలో అడుగులో అడుగు వేసి టీపిసిసి చీఫ్ కి అండగా నిలిచారు. పాదయాత్రలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేయడం విశేషం. యువత ఉత్సాహంతో పాల్గొన్నారు. కళాకారుల నృత్యాలు, బాణసంచా సంబరాలు ప్రజలను ఉర్రూతలూగించాయి. పాదయాత్రలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మురళి నాయక్, నాయిని రాజేందర్ రెడ్డి, యశస్విని రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సిరాణి , నమిండ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. మహేష్ కుమార్ గౌడ్ పాదయాత్రలో భాగంగా పలు చోట్ల అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు మహిళలు డప్పుల చప్పుళ్లతో, బొనాలతో ఘన స్వాగతం పలకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ

## ఏడుగురు అరెస్టు.. భారీగా పట్టుబడ్డ డ్రగ్స్

**హైదరాబాద్, మహా :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో రేవ్ పార్టీపై పోలీసులు దాడి చేసి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కొండాపూర్‌లోని రాజేశ్వరి నిలయం అనే సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తున్నట్లు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులతో పాటు ఈగల్ టీమ్ జాయింట్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ దాడిలో నిందితుల నుంచి 20 గ్రాముల కొకైన్, 3 గ్రాముల ఎండీఎంఏ, 8 గ్రాముల డ్రగ్ పిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో తేజ, విక్రమ్, నీలిమ, చందన్, పురుషోత్తం రెడ్డి, భార్గవ్, రాహుల్ ఉన్నారు. వీరిలో తేజ, విక్రమ్ ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు కాగా నీలిమ, పురుషోత్తంరెడ్డి, భార్గవ్ హైదరాబాద్‌కు చెందినవారు. చందన్, రాహుల్ బెంగళూరుకు చెందినవారిగా మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. వీరిద్దరూ కలిసి డ్రగ్స్ సరఫరా చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజమండ్రి డిప్యూటీ తహసీల్దార్ మణిదీప్ 2023లో గోవాలో రేవ్ పార్టీ నిర్వహించాడని దానికి తేజ, నీలిమ, విక్రమ్‌లను ఆయన ఆహ్వానించినట్లు డీసీపీ తెలిపారు.



డ్రగ్స్ సప్లయర్ రాహుల్ ద్వారా మణిదీప్‌నకు తేజ, నీలిమ, విక్రమ్ పరిచయమయ్యారని తెలిపారు. తరచూ రాజమహేంద్రవరంలోని మణిదీప్‌నకు ఉన్న ఫాంహౌస్‌లో నిందితులు డ్రగ్స్ సేవించేవారన్నారు. మణిదీప్, తేజ, నీలిమ తరచూ డ్రగ్స్ సేవించినట్లు గుర్తించినట్లు తెలిపారు. మణిదీప్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ఈగల్ టీం రాజమహేంద్రవరం వెళ్లిందని డీసీపీ చెప్పారు. పట్టుబడిన నిందితులకు డ్రగ్ టెస్టు నిర్వహించగా అందిరికీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మల్నాడు రెస్టారెంట్స్ డ్రగ్స్ కేసులో కీలకంగా ఉన్న నిందితుడు విక్రమ్ రెడ్డి రేవ్ పార్టీ కోసం బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు తేజ, విక్రమ్ రెడ్డి రాజమండ్రికి చెందినవారు కాగా తరచూ డ్రగ్ పార్టీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తొలుత బెంగళూరులో ఉన్న వీరు హైదరాబాద్‌కు మకాం మార్చి నగరంలో రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. వీరిలో విక్రమ్ రెడ్డి అనే నిందితుడికి మల్నాడు రెస్టారెంట్ డ్రగ్స్ కేసులో ప్రధాన సూత్రధారి సూర్యతో సంబంధాలున్నట్లు గుర్తించారు. బెంగళూరులో ఉన్న డ్రగ్స్ సరఫరాదారుడు రాహుల్‌తో రాజమండ్రి డిప్యూటీ తహసీల్దార్ మణిదీప్‌కు సంబంధాలున్నట్లు గుర్తించిన ఈగల్ టీం పోలీసులు 2024 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గోవాలో మణిదీప్ రేవ్ పార్టీ నిర్వహించినట్లు గుర్తించారు. ఈ రేవ్ పార్టీకి తేజ, నీలిమలను డిప్యూటీ తహసీల్దార్ మణిదీపే ఆహ్వానించాడని పోలీసులు వెల్లడించారు. కేసులో పట్టుబడిన నిందితులంతా గతంలో బెంగళూరులో ఉన్న రాహుల్ నుంచి డ్రగ్స్ తెప్పించుకుని రాజమండ్రిలో మణిదీప్‌కు చెందిన ఓ ఫామ్‌హౌజ్‌లో రేవ్ పార్టీలు నిర్వహించినట్లుగా తేల్చారు.

# మూడు వేలు కొట్టు.. రేషన్ కార్డు పట్టు

## ఖమ్మం జిల్లాలో పేట్రేగుతున్న రేషన్ కార్డు దందా

- ఖమ్మం జిల్లాలో పేట్రేగుతున్న రేషన్ కార్డు దందా
- రెవెన్యూ–మీసేవ సిబ్బంది కుమ్మక్కు బహిర్గతం
- కార్యాలయాల చుట్టూ తిప్పి దోపిడీ ఆటలు
- ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకున్న అధికారులు



(మొదటిపేజీ తరువాయి)

కార్డుల కోసం నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయాలు, పౌరసరఫరాల శాఖల చుట్టూ తిరిగే ప్రజలను అధికారులు ఉద్దేశపూర్వకంగా తిప్పేస్తున్నారు. దరఖాస్తులు పెండింగ్లో పెట్టి, చివరికి "లంచం లేకుండా ఒక్క అడుగు ముందుకు కదలదు" అన్న రీతిలో వసూళ్లు చేస్తున్నారు. మీ సేవా కేంద్రాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రభుత్వం ఖరారు చేసిన ఫీజులను ఎవరూ పట్టించుకోకుండా, మూడింతల-ఐదింతల వరకు వసూళ్లు చేస్తున్నారు. ఇటీవల ఖమ్మం నగరంలో ఒక మీసేవ నిర్వాహకుడు బహిరంగంగానే "రూ.3 వేలు ఇస్తే కొత్త కార్డు ఇప్పిస్తాను" అని డిమాండ్ చేసిన ఘటన, ప్రజల కోపాన్ని రగిలించింది. బాధితుడు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా పలుమార్లు ఫిర్యాదులు చేసినా, పై స్థాయి అధికారుల నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం కొందరు అక్రమార్కుల అత్యాశ కారణంగా.. పేదలకు దూరమవుతున్న దుస్థితి నెలకొంది.

**ప్రజల బలహీనతతో ఆటలు**

రేషన్ కార్డు లేకపోతే పేదలకు సంక్షేమ పథకాలు అందవు. ఈ బలహీనతను బాగా తెలిసిన అధికారులు, స్థానిక నాయకులు "మేమే ఇప్పిస్తాం" అంటూ కార్డుల కోసం తిప్పే ప్రజలను మోసం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం అర్హులందరికీ కార్డులు అందిస్తామని హామీ ఇస్తుంటే, మరోవైపు అదే కార్డులు "డబ్బు ఇస్తేనే లభించే పత్రం"గా మారాయి. తహసీల్దార్ కార్యాలయాల నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖ వరకు ఈ వసూళ్ల మాఫియా బలంగా నడుస్తున్నట్లు సమాచారం. రూరల్, అర్బన్, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం మాత్రమే కాకుండా దాదాపు అన్ని మండలాల్లో ఒకే తంతు కొనసాగుతోంది.

**'మీ సేవా' – ప్రజల రక్తం పీల్చే కేంద్రాలు.**

ప్రజలకు సులభంగా ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాలు, ఇప్పుడు దోపిడీ కేంద్రాలుగా మారిపోయాయి. ఏ ధ్రువపత్రం కావాలన్నా, ఏ దరఖాస్తు పెట్టుకున్నా "ముందు డబ్బు – తర్వాత సేవ" అనే పద్ధతి అమలు అవుతోంది. ప్రభుత్వం ఖరారు చేసిన రేట్లు బోర్డులపై ప్రదర్శిస్తున్నప్పటికీ, వాస్తవానికి మాత్రం మూడింతలు వసూలవుతున్నాయి. ఇక ప్రజల్లో వినిపిస్తున్న ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. మీ సేవా నిర్వాహకులు – ఈడీఎంల మధ్య నెలనెలా "ఖర్చులు" పేరుతో లావాదేవీలు జరుగుతున్నాయన్న మాటలు వినిపిస్తున్నాయి. అంటే, కింద స్థాయి వసూళ్లు పై అధికారులకు చేరుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**ప్రభుత్వం స్పందించాలన్న డిమాండ్.**

ప్రజల మాట ఏకగ్రీవం – "ప్రభుత్వం నిజంగా పేదల పక్షాన నిలబడాలంటే ముందుగా రేషన్ కార్డు మాఫియాను అరికట్టాలి. మీ సేవా కేంద్రాల దోపిడీని తక్షణమే ఆపాలి" అని. లేకపోతే, ఈ మాఫియా మరింత విస్తరించి పేదలపై భారమవుతుందని ప్రజలు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ఒక రేషన్ కార్డు కోసం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూళ్లు జరుగుతుంటే, ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటం అసహనాన్ని రేకెత్తిస్తోంది. పేదలు తమ హక్కు కోసం అడుగుతుంటే, అధికారులూ – నాయకులూ దాన్ని డబ్బుల వసూళ్ల పథకంగా మార్చేయడం నిజంగా దారుణం.

**మాఫియాను అరికట్టకపోతే...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రేషన్ కార్డు మాఫియా పెరుగుతున్న వేళ, ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోకపోతే పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉంది. కార్డు కోసం తిప్పే ప్రతి కుటుంబం, చివరికి అప్పులు చేసి డబ్బులు కట్టే పరిస్థితికి దిగజారుతోంది.

# బరాబర్ స్థానిక ఎన్నికలు పెడతాం..

(మొదటిపేజీ తరువాయి)

విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో నాలుగు ఫ్లైఓవర్లు, దుర్గం చెరువు సెల్ఫీ పాయింట్ తప్పా ఏలాంటి అభివృద్ధి జరగలేదని గుర్తుచేశారు. బరాబర్‌గా స్థానిక సంస్థల ఎన్నికలు పెడతాం.. 42శాతం బీసీ రిజర్వేషన్ ఇస్తామని సవాల్ విసిరారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లే దమ్ముందా అని కేటీఆర్ అంటున్నారని.. పదేళ్లలో 60 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారితే.. అప్పుడు మీ దమ్ముకు దుమ్ము పట్టిందా.? అని సెటైర్లు గుప్పించారు. హైదరాబాద్‌లో ఎక్కువ మంది ఎమ్మెల్యేలు గెలిచిన గులాబీ పార్టీకి.. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కి సున్న వచ్చిందని దెప్పిపొడిచారు. కంటోన్మెంట్‌లో గులాబీ పార్టీ మూడో స్థానానికి దిగజారిందని విమర్శించారు. మీడియా సమావేశాలు మూడు పూటలా పెట్టకపోతే.. ప్రజలు మర్చిపోతారని కేటీఆర్ అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పతివ్రత మాటలు మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్‌ను మీ కుటుంబం వాడుకొని.. ఆర్థికంగా ఎదిగిందని విమర్శించారు. చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు కూడా హైదరాబాద్ అభివృద్ధి కుంటు పడలేదని స్పష్టం చేశారు.

**ఎప్పుడూ లేదన్నట్లు హరీశ్ రావు మాట్లాడటం విడ్డూరం..**

హరీశ్ రావు ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు డెంగ్యూ మరణాల సంఖ్య ఉందని గుర్తుచేశారు. కేవలం రేవంత్ రెడ్డి హయాంలో మాత్రమే డెంగ్యూ వస్తోందని, ఎప్పుడూ లేదన్నట్లు హరీష్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. వర్షాకాలం వచ్చిందంటే.. డెంగ్యూ వస్తుందని తెలిపారు. ఓబీసీలకు రిజర్వేషన్ కావాలనే తాము ప్రయత్నాలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో ఏ ప్రభుత్వం ఏం చేసిందో తెలుస్తోందని తెలిపారు. బీజేపీకి పది మంది ఎమ్మెల్యేలు లేరని.. స్థానిక సంస్థల్లో సగం స్థానాలు ఎలా వస్తాయని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని సబ్ కమిటీ వేశామని నొక్కిచెప్పారు. బీసీలపై బీజేపీ, బీఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే.. 42శాతం పార్టీ పరంగా ఇస్తామని ప్రకటించాలని ఛాలెంజ్ చేశారు. రేవంత్‌రెడ్డిని బీజేపీ ఎంపీలు కాపాడితే.. తెలంగాణ నంబర్ వన్ అయ్యేదని, మెట్రో ఫేజ్ 2 వచ్చేదని స్పష్టం చేశారు. తెలంగాణకి రావాల్సిన వాటాను గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పంపుతోందని హాట్ కామెంట్స్ చేశారు.

# బీసీలను మోసం చేస్తే మీ భరతం పడతాం

- ఎంపీ ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్
- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు జరపాలి
- 50 ఏళ్లు పరిపాలిస్తే ఒక్క బీసీ ముఖ్యమంత్రి నైనా చేశారా?
- కాంగ్రెస్ మరో పదేళ్లు అధికారంలో ఉన్నా బీసీ బిడ్డ సీఎం అయ్యే చాన్స్ ఉండదు
- ఆర్ కృష్ణయ్య చేస్తున్న సత్యాగ్రహ దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపిన ఎంపీ



**హైదరాబాద్, మహా:** మా బీసీల ఆత్మగౌరవంతో చెలగాటమాడితే మమ్మల్ని అడ్డం పెట్టుకొని మోసగించే ప్రయత్నం చేస్తే మీ భరతం పట్టడం ఖాయమని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. ఎన్నికల్లో ఓడిపోతామని భయంతో బీసీల సమస్య అడ్డం పెట్టుకొని అది తేలేవరకు ఎన్నికలు జరపమని మోసం చేసే ప్రయత్నం చేస్తే.. తప్పకుండా తెలంగాణలో ఉన్న బీసీ సమాజం మిమ్మల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అన్నారు. మాయ మాటలు బంద్ పెట్టి తక్షణమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరా పార్క్ వద్ద స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఆర్ కృష్ణయ్య చేస్తున్న సత్యాగ్రహ దీక్షలో పాల్గొని ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఇందిరా పార్క్ దగ్గర వందల మంది చేస్తున్న దీక్ష కాదు ఇది.. 50 శాతం పైబడి ఉన్న బీసీలంతా కూడా ధర్నా చౌక్ దగ్గర చేస్తున్న దీక్ష అని చెప్పారు. మీ బీసీ పాలసీ దేశానికే ఆదర్శవంతమైందని రాహుల్ గాంధీ కీర్తిస్తున్నారని చెప్తున్నావో అది మా ప్రజానీకాన్నే మెప్పించనప్పుడు దేశ ప్రజానీకాన్ని ఎలా మెప్పిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. తమిళనాడు గవర్నమెంట్ మాత్రమే 21 మంది ఐఏఎస్ ఆఫీసర్లతో బీసీ రిజర్వేషన్ చేయాలని సంకల్పంతో విద్య, ఉద్యోగాలు, రాజకీయాలలో కూడా రిజర్వేషన్లు కావాలని, ఆ ప్రభుత్వం మాత్రమే ప్రయత్నం చేసిందని తెలిపారు. వాళ్లు కేవలం ఆ కమిషన్ కోసమే కాకుండా ప్రతి 10 ఏళ్లకు ఒకసారి రాష్ట్రంలో ఉన్నటువంటి సామాజిక, ఆర్థిక, విద్యా పరమైన రిపోర్టును ఎప్పటికప్పుడు అందజేస్తున్నారని తెలిపారు. ఆ కమిట్మెంట్ ఉంటే తప్ప ఇది అమలు అయ్యే పరిస్థితి లేదన్నారు. పార్టీ కొత్త పార్టీ కాదని, 1956 నుంచి ఇవాళ్టి వరకు మీ పార్టీ 50 ఏళ్లు పరిపాలిస్తే ఒక్క బీసీ ముఖ్యమంత్రి నైనా చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మరో పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లే ముఖ్యమంత్రులు అవుతారు తప్ప ఒక్క బీసీ బిడ్డ ముఖ్యమంత్రి అయ్యే ఆస్కారం లేదన్నారు. ప్రాంతీయ, కుటుంబ పార్టీలు ఉన్నన్ని రోజులు వాళ్లే పరిపాలన చేస్తారు తప్ప బీసీలు పరిపాలన చేసే ఆస్కారం లేదన్నారు. ఒక బీసీని ప్రధాని, 27 మంది ఓబీసీలను మంత్రులుగా చేయగలిగిన పార్టీ.. భారతీయ జనతా పార్టీ మాత్రమేనని కొనియాడారు. ఉపరాష్ట్రపతి పదవిని కూడా ఓబీసీకి ఇచ్చి సన్మానించుకున్న చరిత్ర మనకు తెలుసని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

## యూరియా సంక్షోభానికి
# కాంగ్రెస్సే కారణం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకుండా, తెలంగాణకు ద్రోహం చేయడంలో మాత్రం కలిసి పనిచేస్తున్నాయని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోడీల మధ్య అంతర్గత ఒప్పందం ఉందని, దానివల్ల తెలంగాణ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో ఆర్మూర్ బీజేపీ నాయకురాలు అలూరి విజయభారతి, పలువురు బీజేపీ నేతలు చేరారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారు. గతంలో మా బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన భవనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడానికి తాపత్రయ పడుతున్నారు. ఆ కత్తెర పట్టుకుని జాగ్రత్తగా తిరగండి," అంటూ ఆయన సెటైర్ వేశారు. ఈరోజు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లిన రేవంత్ రెడ్డి, గతంలో కేసీఆర్ పునాది వేసిన భవనాలను ప్రారంభించి వచ్చారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న 'వికృతమైన' మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, గత ముఖ్యమంత్రులతో పోల్చి చూసి రేవంత్‌ను బండ బూతులు తిడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు చేయకపోవడాన్ని తీవ్రంగా విమర్శించిన కేటీఆర్, "గోదావరి నీళ్లను దిగువకు పంపి చంద్రబాబు కడుతున్న కనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు తరలించేందుకు రేవంత్ కుట్ర చేస్తున్నాడు. ఇది మోడీ, చంద్రబాబు ఆదేశాల మేరకే జరుగుతోంది" అన్నారు. మోడీ, చంద్రబాబు ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి గోదావరి నీళ్లను కిందికి పంపించేందుకు కుట్ర చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

**ఫిర్యాదు చేసినా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదు..**

'కాళేశ్వరం నీళ్లు ఆగకుండా, గోదావరి నీళ్లు కిందికి వెళ్లి చంద్రబాబు కడుతున్న కనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు వెళ్లాలనేది కేంద్రంలోని బీజేపీ, రేవంత్‌కు ఇచ్చిన ఆదేశం. అందుకే రేవంత్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పగ పట్టారు.' అని కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో యూరియా కొరత ఒకవైపు ఉంటే, రేవంత్ రెడ్డి మరోవైపు సినిమా వాళ్ళతో సమావేశాలు పెట్టుకున్నారని కేటీఆర్ విమర్శించారు. "యూరియా కొరతకు 'ఆపరేషన్ సిందూర్' కారణమని బీజేపీ ఎంపీలు చెబుతున్నారు. అందుకే చైనా నుంచి ఎరువులు రాలేదని అంటున్నారట. అసలు మనకు చైనాతో యుద్ధం జరిగిందా? రేవంత్‌పై మాట పడకుండా బీజేపీ కాపాడుతోంది," అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, నరేంద్ర మోడీల మధ్య అనేక పోలికలు ఉన్నాయని, ఇద్దరూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. "ఒకరు బడా మోడీ, మరొకరు చోటా మోడీ. ఇద్దరూ కలిసి పని చేస్తున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహార శైలి చూస్తుంటే, ఆయన రేపో మాపో మోడీతో కలిసిపోవడం ఖాయం అనిపిస్తోంది. దీనివల్ల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకే పెద్ద దెబ్బ తగులుతుంది," అని కేటీఆర్ విశ్లేషించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా ఎనిమిది చొప్పున ఎంపీ స్థానాలను పంచుకున్నారని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి హామీల వైఫల్యాలపై బీజేపీ ఎంపీలు ఏనాడు ప్రశ్నించడం లేదని, కానీ రేవంత్‌కు రక్షణగా కేసీఆర్ పై మాత్రం విమర్శలు చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. అమృత్ స్కాం, హెచ్‌సీయూ భూముల స్కామ్‌లపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.

# కాంగ్రెస్ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారా?

**నిజామాబాద్, మహా:**

తెలంగాణలో సైతం ఓట్ చోరీ జరిగిందంటూ ఇటీవల టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్ చందర్ రావు స్పందించారు. టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. 'తెలంగాణలోనూ దొంగ ఓట్లున్నాయి.దొంగ ఓట్లతోనే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. దొంగ ఓట్లు లేకపోతే బండి సంజయ్ గెలిచేవారు కాదు. బండిసంజయ్ బీసీ కాదు.. దేశ్‌ముఖ్. కులం మతం లేకపోతే బీజేపీ గెలవదు.' అని వ్యాఖ్యానించారు. సోమవారం నిజామాబాద్ బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రామ్ చందర్‌రావు.. కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. మహేష్ కుమార్ ఓట్ చోరీ అంటున్నారు కదా.. ఇది ఓట్ చోరీ కాదు.. రాహుల్ గాంధీ బ్రెయిన్ చోరీ అంటూ మండిపడ్డారు. ఏ ఓటర్ లిస్టుతో కాంగ్రెస్ అధికారం చేపట్టిందో అదే ఓటర్ లిస్ట్‌తోనే బీజేపీ కూడా గెలిచిందన్నారు. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ చోరీ జరిగిందనే అంశాన్ని ఇక్కడ రామ్ చందర్‌రావు ప్రస్తావించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తోడు దొంగలు.. మరి కాంగ్రెస్ ఎంపీలు సైతం దొంగ ఓట్లతో గెలిచారా? అంటూ ప్రశ్నించారు. 'ముస్లింలకు రిజర్వేషన్‌లు పెంచి బీసీల రిజర్వేషన్‌లు తగ్గించే కుట్ర కాంగ్రెస్ చేస్తోంది. రాష్ట్రంలో కృత్రిమ యూరియా కొరతకు కాంగ్రెస్ కుట్రలు చేస్తుంది. దీనిపై మంత్రులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, సృష్టిస్తున్న కృత్రిమ కొరత. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. యూరియా సమస్యపై కాంగ్రెస్ పార్టీ రైతులను రెచ్చ కొడుతుంది. ఓటమి భయంతో.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం భయ పడుతుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తోడు దొంగలు..ఈ రెండు పార్టీలకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు. పసుపు బోర్డు నిజామాబాద్ లో ఏర్పాటు చేయటం మామూలు విషయం కాదు' అని రామ్ చందర్ రావు స్పష్టం చేశారు.







Z కేటగిరి

రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# రేవంత్ వైపే ఓటు బ్యాంకులు





- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

సన్నబియ్యం,ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు, మహిళల ఉచిత ప్రయాణం వంటి కార్యక్రమాలు ఇప్పటికే రేవంత్ రెడ్డి ఖాతాలో చేరిపోయాయి.ఇక బీసీ రిజర్వేషన్లను కూడా అమలుచేస్తే బీసీల ఓట్లన్నీ గంపగుత్తగా కాంగ్రెస్ పార్టీకి పడతాయని పరిశీలకులు భావిస్తున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్,బీజేపీలకు ఎలాంటి అస్త్రాలూ లేవు. నిరాయుధంగానే ఆ రెండు పార్టీలు రేవంత్ తో తలపడవలసి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం పైనా,సీఎం.రేవంత్ రెడ్డి పైనా భయంకరమైన 'వ్యతిరేకత' ఉన్నట్టుగా కేసీఆర్ పార్టీ చేస్తున్న ప్రచారానికి ఎలాంటి మైలేజీ రాకపోగా చాలా ప్రాంతాల్లో పరిస్థితులు రివర్స్ లో ఉన్నాయి. ఏమి చెప్పుకొని ప్రజల ఓట్లు అడగాలో బిఆర్ఎస్ పండితులకు తోచడం లేదు.రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా జరిపే ప్రచారమే తమ ప్రధాన ఆయుధంగా ఆ పార్టీ భావిస్తున్నట్లుంది.వాస్తవంగా చూస్తే అది వర్కవుట్ అయ్యేలా లేదు.కేసీఆర్,కేటిఆర్,హరీశ్ రావు పలు వ్యవహారాల్లో 'తప్పటడుగులు' వేస్తూ,నకిలీ ప్రచారం చేస్తూ,కోర్టులకు వెడుతూ తమకు తామే బోల్తా కొడుతున్నారు.కేసీఆర్ పార్టీపై రేవంత్ రెడ్డి కనిపించని 'ముష్టి ఘాతాలు' కురిపిస్తున్నారు. గాయాలు కనిపించడం లేదు కానీ నొప్పి భరింపరాకుండా ఉన్నది.

తెలంగాణలో సామాజికవర్గాల వారీగా లెక్కలు తేలాయి. జనాభా ప్రాతిపదికన ఆయా కులాలకు రాజకీయ అధికారంలో వాటా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. దీనికి కర్త,కర్మ,క్రియ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయనిపుణులతో విస్తృత సంప్రదింపులు జరపాలని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీ నిర్ణయించింది.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయనిపుణులతో విస్తృత సంప్రదింపులు జరపాలని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఆగస్టు 23 న నిర్ణయించింది.నిపుణుల సలహా మేరకు ముందుకెళ్లాలని తీర్మానించింది.రేవంత్ రెడ్డికి ఉన్న జనాకర్షణ,పార్టీ ఓటు బ్యాంకుతో పాటు,బీసీ సామాజికవర్గాలు కూడా తోడయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని విజయం లభించే అవకాశాలున్నాయి. బీజేపీతో బిఆర్ఎస్ పార్టీ చేతులు కలిపిందనే ప్రచారం ఉధృతం చేయడం ద్వారా ముస్లిం ఓటర్లను కాంగ్రెస్ పార్టీ వైపునకు హైజాక్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ వ్యూహరచన చేస్తున్నారు.బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత,బీజేపీ ఎంపీ సీఎం.రమేశ్ ప్రకటనలను ఈ ప్రచారానికి ఆధారాలుగా వాడుకోవచ్చునని రేవంత్ ఆలోచిస్తున్నారు.'బీజేపీలో బిఆర్ఎస్ విలీనానికి మా పార్టీలో కుట్ర జరుగుతోంది' అని కవిత చేసిన ఆరోపణలపై ఆ పార్టీ అధినేత నుంచి జవాబు లేకపోగా,కేటీఆర్ వంటి నాయకులు అరకొరగా ఇచ్చిన సమాధానాలేవీ ప్రజల్లోకి వెళ్ళలేదు.కవిత వ్యాఖ్యలను సాధారణ జనం నమ్ముతున్నారు.దీన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలని రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లాన్ వేశారు.

న్యాయ కోవిదులతో సంప్రదింపులు జరిపేందుకు ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క,మంత్రులు ఉత్తమ్,శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్,సీతక్కలతో ప్రత్యేక కమిటీ ఏర్పడింది.స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు గల మార్గాలపై దేశంలోని ప్రముఖ న్యాయ,రాజ్యాంగ నిపుణులతో ఈ కమిటీ సంప్రదింపులు జరపనుంది.స్థానిక ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీలకు ఉన్న 27 శాతం రిజర్వేషన్‌కు తోడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తే.. మొత్తం రిజర్వేషన్లు 69 శాతానికి చేరతాయి.ఈ రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లడానికి ఉన్న అవకాశాలపై న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణుల నుంచి కమిటీ అభిప్రాయాలు తీసుకోనుంది. కులగణన సర్వేపై ఏర్పాటైన నిపుణుల కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభిప్రాయాన్ని కూడా తీసుకోనుంది. వీటన్నింటితో కూడిన నివేదికను ఈ నెల 26 కల్లా ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ నెల 29న రాష్ట్ర క్యాబినెట్ సమావేశమై కమిషన్ సూచన ఆధారంగా బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుంటుంది.

''రాహుల్‌గాంధీ ఆదేశం మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టి.. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులూ ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తీసుకొచ్చారు.ఆ అడ్డంకిని తొలగించడానికి పంచాయతీరాజ్ చట్టానికి సవరణ ఆర్డినెన్సును తీసుకువచ్చాం.ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు మేలు జరగాల్సిందేన.స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతూ జీవో తీసుకువచ్చాం పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టికెట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుని సెప్టెంబరు 30లోగా ఎన్నికలకు వెళ్లవచ్చు. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు బిల్లులను ఆమోదించుకోవడం కోసం న్యాయపోరాటం చేస్తున్నాం.కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్నాం.ప్రస్తుతం రాష్ట్రంలో పార్టీకి మంచి వాతావరణం ఉంది.వెంటనే స్థానిక ఎన్నికలకు వెళ్లడం మేలని 90 శాతానికి పైగా సభ్యులు అభిప్రాయపడుతున్నారు''అని ముఖ్యమంత్రి రేవంత్ పీఏసీలో వివరించారు.

కాగా కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే సమాచారం ఏమైంది?అనే చర్చ మళ్ళీ మొదలైంది. అంత హడావుడి చేసి చేపట్టిన ఆ సర్వే ఫలితాలు ఎందుకు బహిర్గతం చేయలేదు? అని జనం అంటున్నారు.2014 ఆగస్టు 19న తెలంగాణలో ఒక సందడి వాతావరణం ఏర్పడింది.ఆరోజు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే కోసం దేశ విదేశాల్లో స్థిరపడ్డ తెలంగాణ వారంతా పల్లెలకు వచ్చారు.పెట్రోలు బంకులు,వంటి నిత్యావసర వ్యాపారాలు కూడా మూసేశారు. ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగులు సెలవులు పెట్టారు.టిక్కెట్లు దొరకని,డబ్బు పెట్టుకోలేని వారు మహారాష్ట్ర నుంచి సైకిల్ తొక్కుకుంటూ తెలంగాణ వచ్చి సర్వేల్లో పాల్గొన్నారు.లండన్,గల్ఫ్ దేశాల నుంచి విమానాల్లో వచ్చి మరీ సర్వేలో పాల్గొన్నారు.ఆ రోజు సర్వే సమయానికి ఇంట్లో లేకపోతే 'మనం తెలంగాణ వాళ్లం కాకుండా పోతాం' అనేంతగా ప్రచారం చేశారు.నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రజల సామాజిక,ఆర్థిక,విద్య,భూ యాజమాన్య,వృత్తి సంబంధ అంశాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం సేకరించేందుకు ప్రయత్నించారు.3.85 లక్షల మంది ప్రభుత్వ సిబ్బందిని ఉపయోగించి,కోటీ ఆరు లక్షల ఫారాలు ప్రింట్ చేసి,తెలంగాణలో ఎవరూ సర్వే మిస్ కాకూడదంటూ భారీ ఎత్తున ప్రచారం చేసి,8 అంశాలపై 94 ప్రశ్నలతో విస్తృతంగా సర్వే నిర్వహించారు.

ఆ సర్వేలో కోటి మూడు లక్షల కుటుంబాలు పాల్గొన్నాయని అంచనా.దీని కోసం ప్రత్యేక సాఫ్ట్ వేర్ రూపొందించి,దాదాపు 25 వేల మంది డేటా ఎంట్రీ సిబ్బందిని ఉపయోగించి ప్రజల భూముల నుంచి,ఆరోగ్య పరిస్థితి వరకూ సమాచారం సేకరించి,క్రోడీకరించి,వాడుకోవడానికి వీలుగా భద్రపరిచారు.భారతదేశ చరిత్రలో ఎక్కడా ఇంత పకడ్బందీగా,ఇంత విస్తృతంగా ఒకరోజు సర్వే జరగలేదని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ తమ శిక్షణా తరగతుల్లో చెప్పేంతగా జరిగిన సర్వే అది.లిమ్కా బుక్ రికార్డులలోనూ నమోదయ్యింది. ప్రభుత్వ రంగ సాఫ్ట్ వేర్, ఇన్ఫర్మేటిక్స్ విభాగం వారికి అయితే అదొక కేస్ స్టడీ.ఈ సర్వేపై కోర్టుల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి.ఆ సర్వేల ఫారాల ప్రింటింగుకే 6 కోట్లరూపాయలు ఖర్చయింది.డేటా ఎంట్రీకి కాలేజీల గదులు వాడుకున్నారు. సర్వే చేసిన వారంతా ప్రభుత్వ సిబ్బంది కాబట్టి అదనపు ఖర్చు లేదు. సిబ్బంది జీతాలు,డేటా స్టోరేజీ,డేటా ఎంట్రీలు మినహా మొత్తమ్మీద 34 కోట్ల వరకూ ఖర్చు అయిందని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ అంచనా.

కేసీఆర్ సర్వేపై కోర్టుల్లో కేసులు ఉండటం వల్లనే బీఆర్ఎస్ పార్టీ బయట పెట్టలేదని బిఆర్ఎస్ వాదన.కానీ ఆ సమాచారాన్ని ప్రభుత్వం తన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల కోసం విస్తృతంగా ఉపయోగించింది.దేశంలో ఎవరూ పెట్టనన్ని పథకాలు తెలంగాణలో ప్రారంభం కావడానికి అదే కారణం.గొర్లు,బర్లు నుంచి రైతు బంధు వరకూ పథకాలన్నీ ఆ సర్వే వల్లనే వచ్చాయని ఆ పార్టీ నాయకులు గర్వంతో చెబుతుంటారు.కాగా కులగణను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. రాహుల్ గాంధీ కూడా హైదరాబాద్‌కు వచ్చి వివిధ సామాజిక వర్గాలతో సమావేశమయ్యారు.సర్వే విషయంలో ఎన్ని విమర్శలు వచ్చినా కాంగ్రెస్ మాత్రం ముందుకు వెళ్లి దాన్ని పూర్తి చేసింది. ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ,పార్టీ పరంగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా 'సమగ్ర కుటుంబ సర్వే' పేరిట వివరాలు సేకరించారన్న ఆరోపణలున్నవి.ఆ వివరాలు అందుకే కేసీఆర్ బయటపెట్టలేదని విమర్శలున్నవి.బీసీల సామాజిక స్థితిని కేసీఆర్ సర్వే కనుగొనలేదు.తెలంగాణలో బీసీల జనాభా తగ్గింది అన్న అంశంపై రాజకీయంగా గగ్గోలు పుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేసిందే బీసీల జనాభా తేల్చడం కోసం.అంతేకాకుండా,ఆయా కులాల సామాజిక, ఆర్థిక స్థితి అంచనా వేయడం కోసం.96 శాతం కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని ప్రభుత్వం ప్రకటించింది.

ఇదిలా ఉండగా స్థానిక ఎన్నికలలో 42% బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి కాంగ్రెస్ తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికను బిఆర్ఎస్ నాయకులు తప్పుబడుతున్నారు. బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొందేందుకు నిజాయితీగా ప్రయత్నాలు చేయడం లేదని బిఆర్ఎస్ బీసీ నాయకుల వాదన.స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రిజర్వేషన్లకు చట్టబద్ధత లభించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది.బిసి ఓట్లను పొందడానికి 42% రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్,బిసిలను మోసం చేస్తోందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఆరోపించారు.మహారాష్ట్ర,తమిళనాడు,బీహార్ వంటి రాష్ట్రాల్లో ఆర్డినెన్స్‌లను గతంలో కోర్టులు కొట్టివేసాయని బిఆర్ఎస్ నాయకులు గుర్తు చేస్తున్నారు.ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శిస్తున్నారు.రాష్ట్రపతి ఆమోదం పొందాలని,42% రిజర్వేషన్లకు చట్టపరమైన చెల్లుబాటు ఉండేలా చూడాలని ప్రధాన ప్రతిపక్షం కోరుతోంది.అయితే రాజకీయపార్టీగా బిఆర్ఎస్ సైద్ధాంతికంగా డోలాయమానంలో ఉన్నట్టు కనబడుతోంది.కవిత వ్యవహారం కావచ్చు,ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కావచ్చు,బిఆర్ఎస్ బీజేపీ మైత్రిపై వస్తున్న ఆరోపణలపై కావచ్చు,42 శాతం బీసీ రిజర్వేషన్లను సమర్థించే విషయంలో కావచ్చు,సామాజిక తెలంగాణపై కావచ్చు,మార్వాడీ గో బ్యాక్ వివాదం కావచ్చు .... అన్ని విషయాల్లోనూ అయితే మౌనం,లేదా డొంక తిరుగుడు సమాధానాలను ఆశ్రయించే మార్గం సరైందని కేసీఆర్ పార్టీ అనుకుంటూ ఉండవచ్చు.

బీసీ ఉద్యమాన్ని అణివేసే కుట్రలో భాగమే "మార్వాడీ గో బ్యాక్" నినాదాన్ని ఉద్దేశపూర్వకంగా కొన్ని సంఘవిద్రోహకర శక్తులు రూపొందించినట్టుగా ఆరోపణలు వస్తున్నవి. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ లలో బీసీలకు రాజ్యాధికార ఉద్యమం పుంజుకుంటున్నందున దాని అణచివేతకు కొన్ని శక్తులు ప్రణాళిక రచించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నవి.తెలంగాణలో బీసీ ఉద్యమం ఒక అడుగు ముందుకేసి అధికారంలో ఉన్న కాంగ్రెస్,ప్రతిపక్షాలు బీఆర్ఎస్,బీజేపీ పార్టీలతో కూడా ధర్నాలు,సమావేశాలు,బహిరంగ సభలు నిర్వహిస్తోంది.బీసీ సంక్షేమ సంఘాలు ఈ నినాదాన్ని ఎత్తు కోవడంతో పలు బీసీ ఫ్రంట్ సంఘాలు ఏర్పడుతున్నాయి.ఫలితంగా తెలంగాణలో పల్లె పల్లెకు బీసీ రాజ్యాధికార నినాదం వేగంగా తీసుకెళ్తున్నది. రాష్ట్రంలో ఎక్కడ,ఏ నలుగురు కలిసి రాజకీయాలు మాట్లాడుతున్నా బీసీల రాజ్యాధికారం చుట్టే చర్చలు తిరుగుతున్నాయి.రాజకీయాల కోసం లేదా బీసీ ఓటు బ్యాంకును తమ పార్టీలకు అనుకూలంగా మలచాలనే ఆలోచనతో ఉన్న పార్టీలు బీసీలకు 79 ఏళ్లుగా జరుగుతున్న అన్యాయాలను మరచిపోతున్నట్టు విమర్శలు వస్తున్నవి. ఇప్పుడు 'జై తెలంగాణ' నినాదం చెల్లని రూపాయిగా మారినందున బీసీ పోరాటాలకు పిలుపునిస్తున్నట్టు బీసీ సంఘాలు ఆరోపిస్తున్నవి.అయితే ఉద్యమం తీవ్రం చేసినా తమకు ఓటు బ్యాంకుగా మారదనే భయం బీఆర్ఎస్ నాయకత్వానికి పట్టుకుందని ఆ సంఘాల విమర్శ.స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 33 శాతాన్ని 22 శాతానికి బీఆర్ఎస్ తగ్గించింది.చట్ట సభల్లో బీసీలకు 56 శాతం సీట్లు ఇవ్వాలనే డిమాండ్ ను బీఆర్ఎస్ పార్టీ నెరవేర్చజాలదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.బీసీని ఎట్టి పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రి స్థానంలో బిఆర్ఎస్ కూర్చోబెట్టదని బీసీ సామాజికవర్గాల్లో ఒక భావన బలంగా ఉన్నది.

బీజేపీ దేశ వ్యాప్తంగా రాజకీయ లబ్ధి కోసం సామాజిక ఎత్తుగడలు వేస్తున్నా తెలంగాణలో ఆ ఆటలు ఆడటానికి సాహసించడం లేదని గత ఎన్నికల్లోనే తేలిపోయింది.తెలంగాణలోని బీసీలు ఆ విషయం అప్పుడే గ్రహించారు.బీజేపీ గురించి తెలియని గ్రామాల్లోని ఓటర్లను కూడా ప్రభావితం చేస్తూ పార్టీకి కొత్త ఉత్తేజాన్ని తీసుకువచ్చిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ను ఎలాంటి కారణం లేకుండా ఎన్నికల ముందు అధ్యక్ష పదవి నుంచి తొలగించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. ఆ పార్టీ కార్యకర్తలతో పాటు యావత్ తెలంగాణ ప్రజలు బీజేపీకి ఎవరో ఒకరు బీసీ కులానికి చెందిన వ్యక్తిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుణ్ని చేసి ఆ అపవాదును తొలగించుకుంటారని భావిస్తున్న తరుణంలో బ్రాహ్మణ కులానికి చెందిన రాంచందర్ రావును ఆ స్థానంలో కూర్చోబెట్టి మరింత అపవాదును బీజేపీ మూటగట్టుకున్నది. బీసీ వ్యతిరేక పార్టీ బీజేపీ అని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి.తమ సహజ నినాదంతో బీసీ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కొత్త దారి ఎంచుకున్నట్టు ఆరోపణలున్నవి.తెలంగాణలో బీసీ నినాద విచ్చిన్నానికి ఒక ఫైరింగ్ నినాదంగా "మార్వాడీ గో బ్యాక్" నినాదం కొన్ని శక్తులు రగిలించినట్టు ప్రచారం జరుగుతోంది.ఆంధ్రా గో బ్యాక్ అనలేని బీఆర్ఎస్ బీసీ ఉద్యమ విరుగుడుకు ఇలాంటి శక్తులను ప్రోత్సహించే అవకాశాలను తోసిపుచ్చలేమని బీసీ నాయకుడొకరు అన్నారు.మరోవైపు "మార్వాడీలు కాదు రోహింగ్యా గో బ్యాక్" నినాదాన్ని భారతీయ జనతా పార్టీ రచించినట్టుగా బీసీ నాయకుడు జాజుల శ్రీనివాస్ ఆరోపించారు.

# దండోరా ఉద్యమ విజయాన్ని గానం చేయాలి



- డా. సంగిశెట్టి శ్రీనివాస్

ఉద్యమంసాహిత్యం పరస్పరం పూరక ప్రేరకాలు. సమాజాన్ని అభ్యుదయ పథంలో నడిపించే రథానికి రెండు చక్రాలివి. ఉద్యమ స్ఫూర్తితో సాహిత్యం వెలువడుతుంది. సాహిత్యం చేకూర్చే చైతన్యంతో ఉద్యమం కొత్త పుంతలు తొక్కుతుంది. ఈ ఉద్యమ చేతనతో సాహిత్యం వెలువడుతుంది. ఉద్యమంసాహిత్యం ఇచ్చి, పుచ్చుకుంటూ ఉంటుంది. ఇదొక చక్ర ప్రక్రియ. ఏ ఉద్యమానికైనా పునాది సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వం సాధించడం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అంశాలు ఉద్యమాలకు ఊపిరులూదుతాయి. అట్లాగే 'వర్గీకరణ' ఉద్యమం కూడా జనాభాలో ఎవరెంతో వారికంత వాటా అన్ని రంగాల్లో హక్కుగా దక్కాలని సాగింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కన్నా కొంత ముందే ప్రారంభమయిన 'వర్గీకరణోద్యమం' ఓ పదేండ్లు ఆలస్యంగా విజయవంతమయింది. మనం పత్యక్ష సాక్షులుగా, భాగస్వాములుగా, లబ్ధిదారులుగా ఉన్న ఈ రెండు ఉద్యమాలు విజయవంతం కావడం ఆధునిక కాలంలో చిరస్మరణీయమైన ఘట్టం. చరిత్రలో కీలక మలుపు. ఈ రెండు ఉద్యమాల్లోనూ ప్రజల ప్రాణత్యాగాలున్నాయి. ఉద్యమ నాయకుల ఉత్థాన పతనాలు, పొరపాట్లు, లొంగుబాట్లు, సర్దుబాట్లు ఉన్నాయి. ఏదిఎట్లున్నా ఆఖరికి ఉద్యమాలు విజయ బావుటాను ఎగరేశాయి. ఒక ప్రజాస్వామిక ఉద్యమం విజయవంతం కావడమంటే సామాజిక చలనంలో ఒక ముందడుగు. భవిష్యత్ ఉద్యమాలకు దిక్సూచి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఎస్సీలను ఏబీసీలుగా వర్గీకరించింది. 30 ఏండ్ల పోరాటానికి దక్కిన గౌరవమిది. దండుగట్టి, దండోరా మోగించిన ఈ ఉద్యమ ఫలితంగానే ఇవ్వాళ తెలంగాణలో రెడ్లతో సమానంగా నలుగురు దళితులు మంత్రులు కాగలిగింద్రు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కరే దళిత మంత్రి ఉండిండే! ఆ గాయానికి గేయం చేసిన చికిత్స ఇది. 'దళితబంధు' కన్నా ఆత్మగౌరవమే మిన్న అని ప్రకటించిన సందర్భం. అంతిమంగా తెలంగాణ తెగువకు దక్కిన గౌరవం.

రాజకీయాల్లో సాధించుకున్న ప్రస్తుత వాటా శాశ్వతంగా మనగలగాలంటే దళితోద్యమాలకు, దళిత సాహిత్యానికి గౌరవం, గుర్తింపు దక్కాలి. మూడు దశాబ్దాల సహనశీల పోరాటాలు పాఠ్యపుస్తకాల్లో పరిచయం కావాలి. కుల మతాలకు అతీతంగా అందరూ చదువుకోవాలి. విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలు కావాలి. పరిశోధనలు జరగాలి. రీసెర్చ్ ఫలితాలు ప్రచురణ కావాలి. ప్రచురితమైన ఫలితాల ఆధారంగా ప్రభుత్వ పథకాలు రూపొందాలి. ఈ దిశలో దళిత చైతన్యవంతులు, బుద్ధిజీవులు చూపాల్సినంత శ్రద్ధ చూపడం లేదు. ఇట్లా జరగనట్లయితే తాటాకు మంటలా ఉద్యమ ఆకాంక్షలు చప్పున చల్లారిపోతాయి. పోరు కాగడా దారిచూపే దివిటీలాగా మనగలగాలి. అంటే విశ్వవిద్యాలయాల నుంచే ఈ చైతన్యం ప్రారంభం కావాలి. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారికి పురిటి నొప్పులను తెలియజెప్పే కార్యక్షేత్రమిది. జీవితాన్ని పోల్చి చూసుకొని అన్యాయాల్ని ధిక్కరించే కేంద్రమిది. అయితే యూనివర్సిటీల్లో వాగ్గేయకారుల ఆట, పాటల అలరింపు కార్యక్రమాలు ఒక ఎంటర్‌టెయిన్‌మెంట్ ఎలిమెంట్స్‌గానే మిగులుతున్నాయి. అట్లాగాకుండా అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి గాంచిన యూజీసీ మాజీ చైర్మన్ సుఖదేవ్ తోరట్ లాంటి వారి ప్రసంగాలు ఇప్పించి తెలుగులో ప్రచురిస్తే గొప్ప మేలు జరుగుతుంది. ఈ విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులు, విద్యార్థులు, స్కాలర్లు ఉమ్మడిగా దళితుల్లో ఎందరికి భూవసతి ఉన్నది, ఎంత మంది ఉద్యోగస్తులున్నారు? వారు ఎదుర్కొంటున్న వివక్ష ఏ స్థాయిలో ఉన్నది. విదేశాల్లో సైతం ఈ వివక్ష ఎందుకు వెన్నాడుతున్నది? విద్య ఎందరికి అందుబాటులో ఉన్నది? ప్రైమరీ పాఠశాలలో చేరిన ప్రతి వంద మందిలో ఎంతమంది విశ్వవిద్యాలయ స్థాయికి వస్తున్నారు? వైద్యం అందరికీ అందుబాటులో ఉన్నదా? పోషకాలు అందరికీ ఏ తీరులో అందుతున్నాయి? సాఫ్ట్‌వేర్ రంగంలో ఎంతమంది దళితులు ఉన్నారు? ఎంతమంది సివిల్ సర్వెంట్లు ఎస్సీల నుంచి ఎంపికవుతున్నారు? లెక్కగట్టి విశ్లేషించి లోపమెక్కడున్నది? దాన్ని అధిగమించేది ఎలా? బడ్జెట్ ఎంత కేటాయిస్తున్నారు? సబ్ ప్లాన్ నిధులను ఎట్లా వినియోగిస్తున్నారు? ఇట్లాంటి అనేక దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై సమగ్రమైన విశ్లేషణ జరగాలి. ఈ విశ్లేషణ, డేటాను బహిరంగ పరిచి ప్రభుత్వంపై వత్తిడి పెంచాలి. ప్రజలను చైతన్యవంతుల్ని చేసి దళితుల వాటాను ఎట్లా? ఎవరు? ఎందుకు కాజేస్తున్నారో చెబితే ఉద్యమం నెక్స్ట్ లెవెల్‌కు వెళుతుంది. అట్లా గాకుండా కేవలం సాంస్కృతిక చిహ్నాలుగా డప్పు, చెప్పు అని చెప్పుకున్నట్లయితే ఈ సమాజం అస్పృశ్యంగానే చూస్తుంది. డప్పు, కొమ్ము, జమిడిక తదితర వాయిద్యాలను ఎంత కళాత్మకంగా మ్రోగించినా ఈ సమాజం కళను గాకుండా, అది ప్రదర్శించే వాడి కులాన్నే చూస్తుంటది. అందుకే సాంస్కృతిక చిహ్నాలను తమ సామాజిక వర్గానికి మాత్రమే పరిమితం చేసుకొని మిగతా సమాజంతో సంభాషిస్తున్న సమయంలో సివిల్ సర్వెంట్లుగా ఎదిగి రావాల్సిన అవసరమున్నది. ఇట్లా ఎదిగిన సివిల్ సర్వెంట్ల వద్ద అగ్రకుల రాజకీయ నాయకులు సైతం ఒదిగి ఉండాల్సి ఉంటుంది.

ఈ దిశలో ముందుకు సాగేందుకు దళితులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. ఈ నిర్దేశనకు తోడ్పడే విధంగా సాహిత్య సృజన జరగాలి. విశ్వవిద్యాలయాల్లో బోధన, చర్చలు, పరిశోధనలు, ప్రచురణలు జరగాలి. నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించేందుకు దళితోద్యమం తోడ్పాటు నందించాలి. ఇన్నేండ్లయినా అంబేద్కర్ చెప్పినట్లు 'పేయింగ్ బ్యాక్ టు ద సొసైటీ' నినాదానికి అనుగుణంగా ఎన్నడైనా ఈ సామాజిక వర్గ రిటైర్డ్ కాని సర్వీసులో ఉన్న సివిల్ సర్వెంట్లు కోచింగ్ సెంటర్లు ఏమైనా నిర్వహిస్తున్నారా? అత్యున్నత ప్రమాణాలతో ఏదైనా విద్యాలయాన్ని నెలకొల్పి ప్రతి సంవత్సరం తెలుగు నేల నుంచి ఓ పది మంది దళితులు ఐఎఎస్, ఐపిఎస్ ఆఫీసర్లుగా ఎంపిక య్యేందుకు వీరి వంతుగా ఏదైనా నిర్మాణాత్మక పాత్ర నిర్వహిస్తున్నారా? ప్రతిభావంతులైన దళితులను డిగ్రీ స్థాయిలోనే గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ, కోచింగ్, వసతి, గ్రంథాలయం అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేసినట్లయితే లక్షల మంది నుంచి ఓ పది మందిని తయారు చేయడం అసంభవమైన విషయమేమీ కాదు. ఇందుకు ముందుగా ఇది నా బాధ్యత అని ముందుకు వచ్చే బృందం కావాలి. నిస్వార్థంగా పనిచేయడమే గాదు, సొంత సమయాన్ని తమ సమాజానికి వెచ్చించే త్యాగ గుణం కావాలి. అంబేద్కర్ అస్తమించిన 69 ఏండ్ల తర్వాత కూడా ఆయన కల ఇంకా కలగానే ఉన్నదంటే స్వార్థత్యాగులు, త్యాగధనులు ఆశించిన స్థాయిలో లేక పోవడమే ప్రధానకారణం. మంద కృష్ణమాదిగ చేసిన వర్గీకరణోద్యమానికి ఊపిరులూదింది సాహిత్యం. ఈ సాహిత్యాన్ని వివిధ ప్రక్రియల్లో సృజించి ఉద్యమ ఆకాంక్షలను దళితేతరులకు సైతం వివరించి డిమాండ్‌కు కవులు, రచయితలు బలాన్ని సమకూర్చుకున్నారు. ఈ ఉద్యమంపై టి.వి. నారాయణ ఇంట్లో ఎన్నో వాదోపవాదాలు జరిగాయి. ఇది ఆయన శతజయంతి సందర్భం. చాలామందికి టి.వి.నారాయణ విద్యావేత్తగా మాత్రమే తెలుసు. అయితే ఆయన సాహితీ సంపన్నుడనే విషయాన్ని ఇందులో వివరించాను. అలాగే పసునూరి రవీందర్, గుడిపల్లి నిరంజన్, సిద్దెంకి యాదగిరి, కె.పి.లక్ష్మీనరసింహ, కిరణ్‌కుమార్ తదితరుల రచనలు ఆ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిఫలింపజేశాయి.

వర్గీకరణ ఉద్యమానికి ఊతమిచ్చే విధంగా సిద్దెంకి యాదగిరి రాసిన 'తశ్వ' కథా సంపుటికి రాసిన ముందుమాట ఉన్నది. ఇందులో ఆనాటి సాహిత్య రాజకీయాలు, రాజకీయ సాహిత్యాలను చర్చించినాను. బోయి విజయభారతి గురించి ఇందులో విశ్లేషణ ఉన్నది. ఆమె జీవితం`రచనలపై విశ్లేషణ, పరిచయం ఉన్నది. ధిక్కార గొంతుకను సదా వినిపించిన ఆమె మూర్తిమత్వానికి అర్హమైన గౌరవం దక్కలేదు. ఇప్పటికీ ఆమె రాసిన పిహెచ్‌డి గ్రంథం అందుబాటులో లేదు. అది అందుబాటులో ఉన్నట్లయితే దక్షిణాత్య తెలుగు సాహిత్యంపై కొత్త లోచూపు ప్రసరించినట్లయితుంది. చరిత్రలో మరుగునపడిన 'తాడి నాగమ్మ'ను వెలికి తీసి ఆమె కథలను సాహిత్యానికి పరిచయం చేసినాను. దున్న ఇద్దాసు గురించి 2016లో రాసిన వ్యాసం విశేషమైన శ్రమకోర్చి, పరిశోధన చేసి రాసినది. ఈ జూలై 20వ తేదీన కాకినాడలో ఆవిష్కృతమవుతున్న చోడగిరి చంద్రరావు సమగ్ర సాహిత్యానికి రాసిన ముందుమాట. తెలుగు సాహిత్యంలో అంబేద్కర్ వాద సాహిత్యాన్ని ఒక వాదంగా ముందుకు తీసుకు వచ్చినవాడు చోడగిరి. అయితే లెఫ్ట్ నేపథ్యంలో ఉన్నవారు దళిత సాహిత్యం అని నిర్ధారించి అంబేద్కర్ వాద సాహిత్యాన్ని విస్మరించారు. తెలుగునాట సైతం కొన్ని విశ్వవిద్యాలయాల్లో సుఖదేవ్ తోరట్ పుణ్యమా అని అంబేద్కర్ పీఠాలు ఏర్పడినాయి. కానీ ఈ పీఠాల్లో సైతం అంబేద్కర్ వాద సాహిత్యంపై ప్రత్యేక పరిశోధన, పరిశీలన, ప్రచురణ, పరిచయం జరగలేదు. దీని వల్ల అంబేద్కర్ వాద సాహిత్యం అందరికీ అందుబాటులో లేకుండా పోయింది. ఇప్పటికైనా అంబేద్కర్ వాద సాహిత్యాన్ని అంబేద్కర్ బతికున్న కాలం నుంచి ప్రచురిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. తెలుగులో ఈ వాద సాహిత్యం ప్రత్యేక ధోరణిగా కూడా చర్చలోకి రావడం లేదు. అంబేద్కర్‌వాద సాహిత్యానికి పెద్ద పీట వేసే విధంగా చోడగిరి పుస్తకానికి రాసిన విస్తృతమైన ముందుమాట కూడా ఇందులో ఉన్నది. తాడి నాగమ్మ, పసునూరి రవీందర్, సిద్దెంకి యాదగిరి, భూతం ముత్యాలు, కె.పి.లక్ష్మీనరసింహ తదితర కథా సంపుటాలపై విమర్శ, చోడగిరి చంద్రరావు, గుడిపల్లి నిరంజన్, కిరణ్‌కుమార్ కవిత్వంపై వ్యాసాలున్నాయి. అట్లాగే కొల్లూరు సత్తయ్య జీవిత చరిత్రపై కూడా విశ్లేషణ ఉన్నది. విస్మృత బహుజన సాహిత్యానికి పట్టకట్టే దిశలో ఇప్పటికే 'ఇమానం', 'ఇంగులం' దళిత అస్తిత్వ వ్యాసాలను మిత్రుడు గుడిపల్లి నిరంజన్ పూనికతో పూలే`అంబేద్కర్ అధ్యయన వేదిక తరపున వెలువడ్డాయి. ఈ పరంపరలో ఇది మూడో గ్రంథం. దీన్ని 'ఇంగితం' పేరుతో వెలువరిస్తున్న నిరంజన్‌కు ధన్యవాదాలు. సమాజంలో అత్యంత అణచివేతకు గురైన దళితులు రాసిన కథలను 'తెలంగాణ దళిత కథలు' పేరిట గతంలో ఈ సంస్థ ద్వారానే ప్రచురితమయింది. తెలంగాణ దళిత కథా సాహిత్యానికి దిక్సూచిగా నిలిచింది. 'తెలంగాణ దళిత కథలు' కాపీలు ఇప్పుడు అందుబాటులో లేవు. అయితే ఆ పుస్తకానికి రాసిన ముందుమాటను కొంచెం విస్తృతం చేసి ప్రచురించే ఆలోచన కూడా ఉన్నది. విస్మృత తొలి తెలంగాణ దళిత కవి దైదవేముల దేవేందర్ రాసిన 'తొండము' గ్రంథాన్ని గత సంవత్సరం వెలువరించారు. అంతేగాదు త్వరలో బీసీ కవియోగుల సాహిత్యాన్ని కూడా ఈ సంస్థ ద్వారా ప్రచురించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. వచ్చే తరం అందిపుచ్చుకోవాల్సిన చైతన్య కాగడా ఇది.

(ఇంగితం పుస్తకానికి రాసిన మాట)

# ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..



## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**ఆమనగల్లు, మహా:** నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవాలాంధిస్తానని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు.సోమవారం కడ్తాల్, ఆమనగల్లు,కల్వకుర్తి, మాడ్గుల, తలకొండపల్లి,వెల్దండ పట్టణ కేంద్రాల్లో జైపాల్ యాదవ్ జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.కడ్తాల్ ముఖ ద్వారం నుండి అభిమానులు,నాయకులు బాణాసంచా, డిజె పాటల నృత్యాలు, భారీ గజమాలతో స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు.జాతీయ రహదారి మొత్తం జన్మదిన వేడుకల ఆనందోత్సాహలతో నిండిపోయింది. బాణాసంచా కాలుస్తూ యువకులు సంబరాలు జరుపుకున్నారు.జైపాల్ యాదవ్ కి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు, అందచేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు,కార్యకర్తలకు తినిపించారు..ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే శ్రీరామ రక్ష అన్నారు.నియోజకవర్గ అభిమానులకు కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. నిస్వార్థంగా పనిచేస్తూ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులకు, ప్రతినిదులకు ప్రజల అండదండాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు.ప్రజా సేవకు అంకితమై పనిచేసే వారికి డబ్బులతో పనిలేదని, ప్రజాభిమానాలు వాటంతటవే వస్తాయన్నారు..ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పేదోడి ఆపిల్... సీతాఫలం

## ఉచితంగా లభించే ఏకైక ఫలం.. రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే గిరిజనులకు ఉపాధి

**ఆమనగల్లు, మహా :** ప్రతి ఏటా వర్షాకాలంలో చెరువులు, గుట్టల ప్రాంతాల్లో ఉచితంగా లభించే ఏకైక ఫలం సీతాఫలం. చిన్న, పెద్ద తేడాలేకుండా ప్రతి ఒక్కరూ తినే మధుర ఫలం..పేదోడి ఆపిల్ గా పిలువబడే సీతాఫలం మాట వింటేనే నోరూరుతుందని, పండులో తియ్యదనంతో పాటు పోషకాలు విరివిగా ఉండడంతో ప్రతి సీజన్ లో ప్రతి ఒక్కరూ సీతాఫలాలు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి తింటే మనిషి శరీరంలో రోగ నిరోధక శక్తి పెరగడమే కాక దీర్ఘకాలిక రోగాలను అదుపు చేసే శక్తి సైతం కలుగుతదని వారు పేర్కొన్నారు.నోరూరించే మధుర ఫలాలు రానే వచ్చేశాయి. అతితక్కువ ధరకు లభించే సీతాఫలాలకు ఈ సీజన్ లో వర్షాలు సమృద్ధిగా పండడంతో ఫలాల దిగుమతి పెరిగింది. సీతాఫలాల సీజన్ రావడంతో మార్కెట్ లో జోరుగా విక్రయిస్తున్నారు.రహదారుల వెంట గంపలు గంపలుగావిక్రయిస్తున్నారు.ఒక్కో సీతాఫలం పది నుంచి ఇరవై ఐదు రూపాయల వరకు ధర పలుకుతున్నాయి. పండ్ల బుట్ట వెయ్యిరూపాయల వరకు పలుకుతున్నది. సీతాఫలాల కాయల బుట్ట సైతం ఐదువందల నుంచి ఏడువందల రూపాయల దాక పలుకుతున్నది. అయినప్పటికీ మధురఫలాల్లో పోషకాలు ఉండటంతో జనం కొనుగోలు చేస్తున్నారు.ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో సీతాఫలాలు విరివిగా పండాయి. తండాలు,



గ్రామాలకు చెందిన గిరిజనులు, ఇతర కూలీలు అటవీ ప్రాంతాలు, గ్రామ శివారు ప్రాంతాల్లోకి వెళ్లి సీతాఫలాలు తెంపి పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు.ప్రస్తుత సమయంలో ఉపాధి అవకాశాలు పెద్దగా లేకపోవడంతో రెక్కల కష్టంపై ఆధారపడి జీవించే కూలీలకు సీతాఫలాల సేకరణ ఉపాధిగా మారింది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ అటవీ భూములు ఎక్కువగా ఉండడంతో ప్రత్యేకంగా గిరిజనులు సీతాఫలాల సేకరణ చేపట్టి ఉపాధి పొందుతున్నారు. సేకరించిన సీతాఫలాలను ఆమనగల్లు నుంచి కడ్తాల వరకు జాతీయ రహదారిపై బుట్టలో పెట్టి విక్రయాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రహదారిపై బుట్టలో అలంకరించి పెట్టిన సీతాఫలాలను చూస్తే చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రోడ్డుపై శ్రీశైలం వెళ్లే వాహనదారులు వాటిని కొనుగోలు చేసి తీసుకువెళ్తుండడంతో కూలీలకు ఆసరాగా మారింది.కోతుల బెడదతో దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు.



### కేబుల్‌లను తొలగించారు

# తీసివేయడం మరిచారు

**రాజేంద్రనగర్ మహా :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కేబుల్ వైర్ లను మునిసిపల్ అధికారుల ఇష్టానుసారం తొలగించి ఎక్కడి వైర్లు అక్కడనే వేయడంతో మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాళ్లకు అడ్డు తగిలి ఎంతోమంది పాదాచారులు, వాహనదారులు, కింద పడి గాయాలయ్యాయి. మున్సిపల్ అధికారులు బాధ్యత రహితంగా వాళ్లను తొలగించి అక్కడ అక్కడే చేయడంతో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిపై మున్సిపల్ అధికారులు వీటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు సంగం శ్రీకాంత్, సుమన్, కందాడ ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు గుట్టమీది నరేందర్, శ్రీధర్, భాను చందర్, సుమనళిని, తిరుపతి, హుసేన్, శ్రీనివాస్, గోపి, శ్రవణ్ తది తరుల ఆధ్వర్యంలో సోమవారం రోజున మణికొండ మునిసిపాలిటీ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేనేజర్ శ్రీధర్ ను కలసి వినతి పత్రం అందజేశారు.

# యూరియా కొరతను తీర్చండి... భాజపా

**ఆమనగల్లు,మహా:** యూరియా కొరతను తీర్చాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఆమనగల్లు,తలకొండపల్లి మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం భారతీయ జనతా పార్టీ నేతలు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెప్పి దగా చేస్తుందని, తక్షణమే యూరియా కొరతను తీర్చాలన్నారు. రైతులకు సరిపడా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని, రైతులు పండించిన పంటలను అంచన వేసిదానికి అనుగుణంగా రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.





### వరద కాలువలు ఆక్రమిస్తే

# చర్యలు తప్పవు

## ఎమ్మార్వో రవీందర్ దత్ హెచ్చరిక

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 318 లోగల వరద కాలువను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎమ్మార్వో రవీందర్ దత్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సారిక రెడ్డి తమ సిబ్బందితో కలిసి వరద కాలువ కబ్జాపై ఆరా తీసి కూల్చివేతలు చేపట్టారు. చెరువులు, కుంటలు, నాలాలపై నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎమ్మార్వో రవీందర్ దత్ హెచ్చరించారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆధునిక ఆర్వో వాటర్ ప్లాంట్

## ప్రారంభించిన ఎంపీ చామల

**రంగారెడ్డి జిల్లా మహా:** దండుమైలారం, యాచారం ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో ఎంపీ నిధులతో ఆధునిక ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని దండుమైలారం గ్రామం, యాచారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆధునిక ఆర్వో వాటర్ ఫిల్టర్ ప్లాంట్లను, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే రోగులకు శుద్ధమైన మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయడం జరిగిందని వారు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల సమస్యలు తెలుసుకుని విద్య వైద్యరంగాలకు పెద్దపీట వేయడం జరిగిందని, ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని, రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రిలలో మరిన్ని మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్పత్రిలో రోజువారి ఓపి గురించి డాక్టర్ను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు, వైద్యులు అందుబాటులో ఉంటూ రోగుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సరైన వైద్య సేవలందించాలని తెలిపారు. కావాల్సిన మందులను జిల్లా ఆరోగ్య కేంద్రం నుంచి తెప్పించుకోవాలని వారు డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ ఏ నవీన్ కుమార్, వైద్యులు డాక్టర్ టి ప్రియాంక, కె మృదుల, డాక్టర్ లలిత, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల రాజశేఖర్ రావు, చైర్మన్ కర్ణాకర్, డైరెక్టర్లు, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బి.ఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి, నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# గుండెపోటుతో నూకం జంగయ్య అకాల మరణం

**రంగారెడ్డి జిల్లా మహా:** కాంగ్రెస్ పార్టీ నాయకులు, నూకం జంగయ్య అకాల మరణానికి చింతిస్తున్నామని ఎంపీ, ఎమ్మెల్యే అన్నారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకం జంగయ్య సోమవారం ఉదయం గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి జంగయ్య భౌతికకాయానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి మనోధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్న వయసులోనే గుండెపోటు కారణంగా వారి మరణానికి చింతిస్తున్నామని, ఒక మంచి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని, పార్టీకి తీరని లోటు అని అన్నారు. జంగయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని, పార్టీ తరపున కుటుంబాన్ని ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య, మాజీ ఎంపిటిసి కావలి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు రావుల భాషయ్య, మార సురేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రావుల రాఘవ, ఎండి అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు



# పేదల పెన్నిధి కాంగ్రెస్ ప్రభుత్వం...

## చేవెళ్ల ఇంచార్జ్ పామేనా బీమ్ భరత్ .. రెడ్డిపల్లిలో రేషన్ కార్డుల పంపిణీ

**రంగారెడ్డి జిల్లా మహా:** రెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ కోసం, మండలం అధ్యక్షులు మానయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ళ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్, మొయినాబాద్ మండలం, రెడ్డిపల్లి గ్రామంలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి దయానంద్ గౌడ్ తో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో కలిసి బోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు వచ్చిన సందర్భంలో లబ్ధిదారులు స్వీట్స్ పంచుతూ, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పథకాలను గ్రామస్తులకు వివరిస్తూ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల పెన్నిధిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పనులను చేపడుతుందని ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రతి పేదవాడికి అందేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, తోల్కట్ట సత్య నారాయణ, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, బాల కృష్ణరెడ్డి, సీనియర్ నాయకులు గన్నెపాగ నర్సింగ్ రావు, బాకారం మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి షాద్నగర్ అసెంబ్లీ ఇన్చార్జి దయానంద్ గౌడ్, కాంతి రెడ్డి, ఎర్ర యాదయ్య, వడ్డే ఆంజనేయులు, కుండే ఆంజనేయులు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.





### బండ్లగూడ జాగిర్ బిజెపి నూతన

# కార్యవర్గం నియమాకం

**రాజేంద్రనగర్, మహా :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. బండ్లగూడ జాగర్ బీజేపీ అధ్యక్షులు కొండ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు శివ గౌడ్, నరేష్ యాదవ్, నవీన్ రెడ్డి, లక్ష్మీ నరసింహ, ప్రధాన కార్యదర్శి పవన్ సాయి, సెక్రెటరీగా భగవంత్ రెడ్డి , భాగ్యలక్ష్మి, ప్రవీణ్ గౌడ్, అనురాధ, కోశాధికారి సూర్య విష్ణు ను కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాలింగం గౌడ్, భీమ అర్జున్ రెడ్డి , పిఎస్ మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,దామోదర్ రెడ్డి, శేఖర్ ముదిరాజ్, గోపాల్ గౌడ్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి

# అధికారులు చొరవ చూపాలి

## సంబంధిత అధికారులకు ఆదేశాలు .. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






### కరాటే పోటీల్లో ఆమనగల్లు

# విద్యార్థుల ప్రతిభ

**ఆమనగల్లు, మహా:** జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం హైదరాబాద్ యూసుఫ్ గూడా లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఇంటర్నేషనల్ ఓపెన్ స్టేడియంలో టోర్నమెంట్ జరిగింది. ఈ టోర్నమెంట్ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన జగదీశ్వర్ అకాడమీ కి చెందిన కరాటే విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు 7 గోల్డ్ మెడల్స్, 2 సిల్వర్ మెడల్స్ సాధించి తమ సత్తా చాటారు.

### కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం..

# రైతుల పక్షాన బీజేపీ వినతి

- అమలు కానీ ఆరు గ్యారెంటీలు
- పాలనలో విఫలం చెందిన కాంగ్రెస్
- బిజెపి జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు


**రంగారెడ్డి జిల్లా మహా:** రాష్ట్రంలో యూరియా, ఇతర రసాయన ఎరువుల కొరత రైతులను తీవ్రమైన ఇబ్బందుల్లోకి నెట్టివేసిందని ఆంజనేయులు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా, లింగాల మండలం కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గువ్వని నవీన్ ఆధ్వర్యంలో బిజెపి మండల ఎన్నికల ఇంచార్జి, జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ తిరుపతమ్మకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా విస్మరించిందని తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో యూరియా, ఇతర రసాయన ఎరువుల కొరత రైతులను తీవ్రమైన ఇబ్బందుల్లోకి నెట్టేసిందని అన్నారు."రైతులకు ఎరువులు సమయానికి అందకపోవడం వల్ల పంట నష్టాలు తప్పడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టమైన వ్యూహంతో ముందుకువచ్చి, ఎరువుల సరఫరా నిరవధికంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మండల రెవెన్యూ అధికారికి ఈ విషయాన్ని తెలియజేశామని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాలని కోరాం," అని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, ప్రజలను మోసం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. బీజేపీ రైతుల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా బిజెపి పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జి అఖిల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు విష్ణు చారి, మండల ప్రధాన కార్యదర్శులు శవ్వ సైదులు యాదవ్, కోల్ల శ్రీనివాసులు, బీజేవైఎం మండల అధ్యక్షులు సాయి సాగర్, హేమంత్, శంకర్, మహేష్, రాములు, శ్రీశైలం, చందు తదితరులు పాల్గొన్నారు.



### సున్నం చెరువులో జారిపడి

# బాలుడు మృతి

**రంగారెడ్డి జిల్లా మహా:** సున్నం చెరువులో జారిపడి బాలుడు మృతి చెందిన ఘటన నాదరగుల్‌లో చోటుచేసుకుంది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి, మహేశ్వరం నియోజకవర్గంలోని, నాదర్‌గుల్‌లోని అశోక్ రెడ్డి కాలనీలో నివాసం ఉండే మొహమ్మద్ అజ్మత్ అలీ కుటుంబానికి చెందిన బాలుడు, సున్నం చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందడం జరిగిందని పోలీసులు తెలిపారు. సిఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం సాయంత్రం వాకింగ్ చేయడానికి సున్నం చెరువు కట్టపై తన తల్లితో వెళ్తున్న క్రమంలో మతిస్థిమితం లేని బాలుడు, తన తల్లి కొంచెం దూరం వెళుతుండగా ఆ బాలుడు తన చిన్న సైకిల్‌ను చెరువు కట్టపై వదిలి చెరువులోకి వెళ్ళాడు, అతను నీటిని చూస్తూ ఎప్పటిలాగే బయటకు వచ్చే క్రమంలో, ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మునిగి మృతి చెందడం జరిగిందని 100 నెంబర్ కు ఫోన్ రావడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సాయంతో చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికి తీసినట్లు పోలీసులు వెల్లడించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.



# ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గం అభివృద్ధి :ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఆమనగల్లు, మహా :** నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు కొత్త అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా వేగవంతం చేశామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు.సోమవారం ఆమనగల్లు, కడ్తాల్ మండల కేంద్రం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాల దృశ్య ప్రజాపాలన చేస్తుందన్నారు. ప్రజా అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యాట గీతా నర్సింహా, మాజీ వైస్ ఎంపిపి జక్కు అనంతరెడ్డి,ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

### నేడు మట్టి వినాయక


# ప్రతిమల పంపిణీ

## గంప వెంకటేష్




**ఆమనగల్లు, మహా:** పర్యావరణ పరిరక్షణ కోసం గత ప్రభుత్వం 11 సంవత్సరాలుగా గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఈనెల 26న మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలోని మిల్క్ చిల్లింగ్ సెంటర్ వద్ద పంపిణీ చేయడం జరుగుతుందని డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. సుమారు 1000 మట్టి ప్రతిమలను అందజేయడం జరుగుతుందని వినాయకుని పూజించే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గంప వెంకటేష్ గుప్తా కోరారు.





## హీరోయిన్ సూపర్ హీరోగా చేస్తే..
# లోక ట్రైలర్ రిలీజ్





తెలుగు సినిమాతోనే హీరోయిన్ అయిన కల్యాణి ప్రియదర్శన్.. ఇప్పుడు పూర్తిగా మలయాళ ఇండస్ట్రీకే పరిమితమైంది. అక్కడే స్టార్ హీరోలతో కలిసి మూవీస్ చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ఈమె ప్రధాన పాత్రలో, 'ప్రేమలు' ఫేమ్ నస్లేన్ మరో కీ రోల్ చేసిన చిత్రం 'లోక'. తెలుగులో 'కొత్త లోక' పేరుతో రిలీజ్ చేస్తున్నారు. తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. పూర్తిగా సూపర్ హీరో కాన్సెప్ట్‌తో తీసిన మూవీ అని ట్రైలర్ చూస్తుంటేనే అర్థమవుతోంది. సాధారణంగా ఇలాంటివి హీరోలు చేస్తుంటారు. కానీ యంగ్ హీరోయిన్‌తో ఈ జానర్ సినిమా చేయడం విశేషం. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ దీన్ని నిర్మించాడు. డొమినిక్ అరుణ్ దర్శకుడు. తెలుగులో ఈ సినిమా 'కొత్త లోక' పేరుతో ఈనెల 28న థియేటర్లలోకి రానుంది. సితార ఎంటర్‌టైన్మెంట్స్ విడుదల చేస్తోంది. ట్రైలర్ బట్టి చూస్తే.. సూపర్ హీరో లక్షణాలుండే లోక(కల్యాణి ప్రియదర్శన్) అనుకోని పరిస్థితుల్లో ఓ ఊరికి వెళ్తుంది. అక్కడే లో ప్రొఫైల్ మెంటైన్ చేస్తూ బతుకుతుంటుంది. అలాంటి ఊరిలో కొన్ని సమస్యలు వస్తాయి. వాటిని లోక ఎలా ఎదుర్కొంది? చివరకు ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తుంది.

# నా దేశానికి చెందిన ఏ సంస్కృతైనా నాదే

జాన్వీకపూర్ లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ మూవీ 'పరమ్ సుందరి' చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్‌పై నెట్టింట ట్రోల్స్ వచ్చాయి. ఉత్తరాది అమ్మాయి అయిన జాన్వీని మలయాళీగా చూపించడంపై పలువురు కేరళ నెటిజన్లు అసంతృప్తి వెలిబుచ్చారు. కేరళ నేపథ్య చిత్రంలో నటించేందుకు కేరళ హీరోయిన్లు లేరా? జాన్వీనే దొరికిందా? అంటూ ప్రశ్నలు సంధించారు. ఈ విషయంపై ఈ సినిమా ప్రమోషన్స్‌లో జాన్వీ మాట్లాడారు. 'అవును నేను ఉత్తరాది అమ్మాయినే. మలయాళీని కాను. ఆమాటకొస్తే మా అమ్మ శ్రీదేవి కూడా మలయాళీ కాదు. కానీ కేరళ సంస్కృతిపై నాకు అపారమైన గౌరవం ఉంది. ముఖ్యంగా మలయాళ చిత్రాలకు నేను అభిమానిని. 'పరమ్‌సుందరి' సినిమాలో నేను తమిళం అమ్మాయిగా కూడా కనిపిస్తా. అయినా నేను ఇండియన్‌ని. నా దేశానికి చెందిన ఏ సంస్కృతి అయినా నాదే.' అంటూ చెప్పుకొచ్చారు జాన్వీ కపూర్.


## మరో వెబ్‌సిరీస్‌లో తమన్నా

**మహా:** ప్రముఖ నటి తమన్నా ఇప్పటికే పలు వెబ్‌సిరీస్‌లతో అలరించగా, ఇపుడు మరో సిరీస్‌లో నటించారు. ఇపుడు 'డు యూ వనా పార్ట్‌నర్' లో నటించింది. ఈ సిరీస్ తమ్మూ లుక్ సూపర్ గా ఉంది. ప్రముఖ ఓటీటీ 'అమెజాన్ ప్రైమ్ వీడియో' ఒరిజినల్ సిరీస్‌గా ఇది రూపొందింది. విడుదల తేదీ సోమవారం ఖరారైంది. ఆ ఓటీటీలో సెప్టెంబరు 12 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ కామెడీ- డ్రామా వెబ్‌సిరీస్‌లో బాలీవుడ్ నటి డయానా పెంటీ మరో కీలకపాత్ర పోషించారు. ఇద్దరు యువతుల స్నేహం, వారు ఎదుర్కొన్న సవాళ్లు తదితర అంశాలను ఈ సిరీస్‌లో చూపించనున్నారు. 'ఓదెల 2'తో ఇటీవల ప్రేక్షకులను పలకరించారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆమెకు వరుస అవకాశాలొస్తున్నాయి.

## కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ క్రేజ్ మామూలుగా లేదుగా..!

ప్రస్తుతం కన్నడ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు రుక్మిణి వసంత్. బెంగుళూరులో జన్మించిన ఈ యంగ్ స్టార్ హీరోయిన్ సింపుల్ లుక్తోనే అభిమానుల హృదయాలను దోచుకుంది. యూత్లో క్రేజీ హీరోయిన్గా నిలిచింది. ఈ క్రేజ్కి తగ్గట్టేగానే అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం, ఆమె చేతిలో మూడు కన్నడ సినిమాలు ఉన్నాయి. ఇందులో కీలక ప్రాజెక్టు కాంతార-ఛాప్టర్ 1 ఒకటి. ఈ సినిమాలో రుక్మిణి 'కనకవతి' పాత్రలో కనిపించనుంది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలవనున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలున్నాయి. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన కాంతార మూవీ బాక్సాఫీస్ వద్ద భారీగా కలెక్షన్లు రాబట్టింది. రుక్మిణి పోషించిన 'కనకవతి' పాత్ర ఎంతో ప్రభావవంతంగా ఉంటుందని, ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుందని టాక్. ఈ విజయంతో రుక్మిణి కెరీర్ కొత్త మలుపులు తిరుగబోతోంది. తెలుగు, తమిళ, హిందీ భాషలలో అవకాశాలు దక్కించుకునే అవకాశం ఉందంటున్నారు. ఇక, ఈ నేపథ్యంలో రుక్మిణి.. తమిళ ఇండస్ట్రీలోనూ వరుస అవకాశాలు వస్తున్నాయి. ఆమె నటించిన 'మదరాసి' సినిమా సెప్టెంబర్ 5న విడుదల కానుంది. ఇది రుక్మిణి నటించిన రెండవ తమిళ చిత్రం. ప్రముఖ దర్శకుడు మురుగదాస్ దర్శకత్వంలో, శివకార్తికేయన్ సరసన నటిస్తున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలున్నాయి. రుక్మిణి వసంత్ ఈ రెండు భారీ చిత్రాలు ఒక నెల తేడాతో విడుదల కావడంతో.. ఒకే సమయంలో రెండు మార్కెట్ పెంచుకునేందుకు రెడీ అయ్యింది. ఈ రెండు సినిమాలు హిట్ అయితే, ఆమెకు మరిన్ని అవకాశాలు, డిమాండ్ అంతకన్నా ఎక్కువగా వస్తాయని సినీ విశ్లేషకులు, ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, ఇక రుక్మిణి తెలుగు మూవీలో నటించనున్నది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వస్తున్న మూవీ హిట్ అయితే ఈ అమ్మడు తెలుగులోనూ వరుస ఆఫర్లు దక్కించుకునే అవకాశాలున్నాయి.

## సడన్ సర్‌ప్రైజ్.. నెలలోపే
# ఓటీటీలోకి కింగ్డమ్



విజయ్ దేవరకొండ గత నెలలో 'కింగ్డమ్' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. పలుమార్లు వాయిదా పడిన చిత్రం.. గత నెల చివరలో థియేటర్లలోకి వచ్చింది. అయితే రిలీజైన ఒకటి రెండు రోజులు హడావుడి నడిచింది. కానీ తర్వాత నెగిటివ్ టాక్ వచ్చింది. కలెక్షన్స్ కూడా పెద్దగా రాలేదు. దీంతో నష్టాలు మూటగట్టుకుంది. అలాంటిది ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించారు. ఇంతకీ ఏ ఓటీటీలోకి రానుందంటే? విజయ్ దేవరకొండభాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన 'కింగ్డమ్' చిత్రాన్ని యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించారు. సత్యదేవ్ కీలక పాత్ర పోషించాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. నాగవంశీ నిర్మాత. జూలై 31న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కాగా.. ఇప్పుడు ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా నెట్‌ఫ్లిక్స్‌లోకి రానుంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు పోస్టర్ రిలీజ్ చేశారు. 'కింగ్డమ్' విషయానికొస్తే.. సూరి (విజయ్ దేవరకొండ) ఓ కానిస్టేబుల్. చిన్న వయసులోనే కుటుంబానికి దూరమైన తన అన్న శివ (సత్యదేవ్) కోసం వెతుకుతుంటాడు. ఆ ప్రయత్నంలోనే పోలీస్ అధికారులతో సూరికి గొడవ జరుగుతుంది. అయితే ఉద్యోగం నుంచి తీసేయకుండా ఓ సీక్రెట్ మిషన్ అప్పజెబుతారు. శివ ఆచూకీ శ్రీలంక సమీపంలోని ఓ ద్వీపంలో ఉందని, గూఢచారిగా అక్కడ పనిచేయాలని చెబుతారు. అన్న కోసం ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధమైన సూరి.. శ్రీలంకలో అడుగుపెడతాడు. మరి సూరికి తన అన్న శివ దొరికాడా లేదా? అక్కడి తెగ 70ఏళ్లుగా ఎవరి రాకకోసం ఎదురు చూస్తోంది? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com